

RNI NO:TELTEL/ 2023/89546

సూర్య రేఖ
తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 427 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | మంగళవారం 27 మే 2025 | వెల : 4/-

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన నెం : 9397303326

## ప్రపంచానికి భారత్ పవర్ చూపించాం

- మేడిన్ ఇండియా వస్తువులు ఉపయోగించాలి..వారి అభివృద్ధికి పాటు పడాలి
- రాజకీయ ప్రయాణంలో మే 26 ముఖ్యమైన రోజు
- రైల్వే రంగానికి కొత్త శక్తి
- ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక సైనిక చర్య కాదు
- ఇది మన భారతీయ విలువలు, భావాల వ్యక్తీకరణ

# తెలంగాణలో కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఫిక్స్!

- రాహుల్‌తో భేటీ.. మంత్రి వర్గ విస్తరణపై టీపీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు
- కేబినెట్‌లో ఆరు పదవులు ఖాళీ ఉండగా.. ఐదుగురిని భర్తీ చేస్తారని సమాచారం.
- బీసీ కోటాలో వాకిటి శ్రీహరి, ఎస్సీ కోటాలో వివేక్ పేర్లు
- రెడ్డి సామాజిక వర్గం నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పేర్లు పరిశీలనలో
- కేబినెట్ విస్తరణపై మా అభిప్రాయాలు ఇప్పటికే చెప్పాం
- రేపో, మాపో టీపీసీసీ కార్యవర్గం ప్రకటన కూడా ఉంటుంది
- వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ఎస్సి,ఎస్‌టి, మైనారిటీలకు అవకాశం?



ఢిల్లీ/హైదరాబాద్

తెలంగాణలో కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. మంత్రి వర్గం కూర్పుపై ఢిల్లీలో వరుస సమావేశాలు జరుగుతున్నాయి. ఇప్పటికే కేసీ వేణుగోపాల్‌తో రేవంత్‌రెడ్డి చర్చించారు. కేబినెట్‌లో ఆరు పదవులు ఖాళీ ఉండగా.. ఐదుగురిని భర్తీ చేస్తారని సమాచారం. రెడ్డి సామాజిక వర్గం నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పేర్లు పరిశీలనలో ఉండగా.. బీసీ కోటాలో వాకిటి శ్రీహరి, ఎస్సీ కోటాలో వివేక్ పేర్లు వినిపిస్తున్నాయి. - మిగతా3లో



## కేటీఆర్‌కు అవినీతి నిరోధకశాఖ నోటీసులు

- భారాస ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ- కేసులో ఈ నెల 28న విచారణకు హాజరు కావాలని నోటీసు
- అయితే, నెలాఖరులో యూకే, అమెరికా పర్యటన షెడ్యూల్ ఇప్పటికే ఖరారైనందున.. తిరిగి వచ్చిన తర్వాత హాజరవుతానని బదులిచ్చిన కేటీఆర్
- “రాజకీయ వేధింపుల్లో భాగంగానే నోటీసులు ఇచ్చారు
- సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ కక్ష సాధింపు కోసం తహతహలాడుతున్నారు.

హైదరాబాద్

భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు అవినీతి నిరోధక శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. భారాస ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ- కేసులో ఈ నెల 28న విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే, నెలాఖరులో యూకే, అమెరికా - మిగతా3లో

## జడ్జి నోట్ల కట్టల వ్యవహారం.. ఆ లేఖలో వివరాలను బహిర్గతం చేయలేం

- కోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ రూపొందించిన నివేదికను బహిర్గతం చేయడం కుదరదు
- అందులో విషయాలను బహిర్గతం చేయాలంటూ ఆర్టీఐ వ్యవస్థ ద్వారా న్యాయస్థాన సమాచార అధికారికి దరఖాస్తు






## పదేళ్లలో గిరిజనుల గురించి కేసీఆర్ ఆలోచించారా?

- భూమి లేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తున్నాం
- ఉద్యోగులకు గత భారాస ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బకాయిలను క్రమంగా చెల్లిస్తున్నాం
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

నాగర్‌కర్నూల్

భూమి లేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తున్నామని తెలంగాణ ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రూ.12 వేల కోట్లతో ఇటీవల నల్లమల డిక్లరేషన్ ప్రకటించామన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా పోల్కంపల్లి, బొమ్మంపల్లి, పదర సబ్ స్టేషన్లను ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న పదేళ్లలో గిరిజనుల గురించి కేసీఆర్ ఆలోచించారా? అని ప్రశ్నించారు. - మిగతా3లో



## మళ్లీ భయపెడుతున్న కరోనా..!

- దగ్గు, జలుబు ఉంటే టెస్ట్ చేయించుకోవాలా..?
- కరోనా జేఎన్.1 వేరియంట్ ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సమస్యలు
- కరోనావైరస్ యొక్క ఇంక్యుబేషన్ పీరియడ్ 4-10 రోజులు
- గతంలో వచ్చిన కరోనా వేరియంట్ల తరహాలోనే ఈ వేరియంట్‌తో ఇన్ఫెక్షన్ కూడా లక్షణాలు






# అండర్ గ్రౌండ్ మెట్రో స్టేషన్‌ను ముంచెత్తిన వరద నీరు

ముంబై: ముంబై మునిగింది. దేశ ఆర్థిక రాజధాని వర్షాలతో అతలాకుతలమైంది. నైరుతి రుతు పవనాల ప్రభావంతో రాత్రి నుంచి ముంబైలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ముంబై మహానగరానికి వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. కుండపోతవానకు నగరం నరకంలా మారింది. రవాణా స్తంభించి పోయింది. రోడ్లు చెరువుల్లా మారడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన కూడళ్లలో భారీ ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాక్‌లపైకి వాన నీరు చేరడంతో రైల్వే సర్వీసుల్లో అంతరాయం ఏర్పడింది. మే 10న ప్రారంభమైన వర్లీ మెట్రో స్టేషన్‌కు వరదనీరు పోటెత్తింది. ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ట్రైన్ వచ్చే వరకు, వచ్చిన తర్వాత ట్రైన్ లోపలికి వెళ్లేందుకు వినియోగించే స్టేషన్ గేట్ల వరకు మాత్రమే కాకుండా ప్లాట్‌ఫామ్‌లను నీరు ముంచెత్తింది. వెలుగులోకి వచ్చిన ఆ వీడియోల్లో ప్లాట్ ఫామ్ పూర్తిగా బురద నీటితో నిండిపోయి ఉండటాన్ని చూడొచ్చు. అంతేకాదు, మెట్రో లోపల తీసిన మరో వీడియోలో పైకప్పులో లీకేజీ కారణంగా ప్లాట్‌ఫారమ్‌పై నుండి నీరు ప్రవహించింది. భారీ ఎత్తున నీరు నిలిచిపోవడంతో మెట్రోసర్వీసులకు ఆటంకం ఏర్పడింది. అయితే, అండర్ గ్రౌండ్ మెట్రో స్టేషన్‌లో వరదకు కారణం డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడమే కారణమని తెలుస్తోంది.



ముంబై మూడు లైన్ల అండర్‌గ్రౌండ్ మెట్రోస్టేష న్‌ను బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ నుండి వర్లిలోని ఆచార్య అత్రే చౌక్ వరకు సేవల్ని అందిస్తోంది. ఈ మెట్రో సేవలు ఈ నెల ప్రారంభంలో మే 10న అందుబాటులోకి వచ్చాయి. ఇటీవలే ప్రారంభమైన మెట్రోస్టేషన్‌ను వరద నీరు ముంచెత్తడంతో మౌలిక సదుపాయాల గురించి ప్రశ్నలు తలెత్తాయి.

# ప్రపంచానికి భారత్ పవర్ చూపించాం

దేశంలో దీపావళి, గణపతి సహా పండగ ఏదైనా సరే భారతదేశంలో తయారైన ఉత్పత్తులను ఉపయోగించాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గుజరాత్ దాహోద్‌లో లోకోమోటివ్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. భారతదేశ ప్రజలు ఆదాయం సంపాదించి ముందుకు సాగాలంటే, ప్రతి భారతీయుడూ ఇక్కడి వస్తువులే వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేయాలన్నారు. మన దేశంలో తయారైన ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్న వేళ, మనం దేశీయ ఉత్పత్తులను ఎందుకు ఉపయోగించకూడదని ప్రశ్నించారు. రైల్వేలతో సహా రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాలకు చెందిన పలు ప్రాజెక్టులను మోదీ ప్రారంభించి, శంకుస్థాపన చేశారు.

**మోదీని ఎదుర్కొవడం**

ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ గురించి కూడా ప్రస్తావించారు. ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక సైనిక చర్య కాదని, ఇది మన భారతీయ విలువలు, భావాల వ్యక్తీకరణ అని మోదీ పేర్కొన్నారు. ఈ క్రమంలో ఉగ్రవాదాన్ని ఆశ్రయిస్తున్న వారు మోదీని ఎదుర్కొవడం ఎంత కష్టమో కలలో కూడా ఊహించలేరని మోదీ చెప్పారు. భారతదేశ



చరిత్రలో తొలిసారిగా గిరిజన గ్రామాల అభివృద్ధికి సాధికారత కల్పించడానికి అనేక కొత్త పథకాలను ప్రారంభించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుర్తు చేశారు. గిరిజన నేత బిర్సా ముండా గౌరవార్థం గిరిజన గ్రామ ఉదయ్ అభియాన్'ను ప్రారంభించినట్లు తెలిపారు.

**రైల్వే రంగానికి కొత్త శక్తి**


దాహోద్ లో ప్రారంభించిన ప్లాంట్‌లో 9,000 హార్స్‌పవర్ విద్యుత్ లోకోమోటివ్స్ తయారు చేయబడతాయి. ఇవి 4,500 టన్నుల బరువును 120 కిలోమీటర్ల వేగంతో తీసుకెళ్లగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఈ ప్లాంట్‌లో తయారు చేయబడిన లోకోమోటివ్స్ భారతదేశంలోనే అత్యంత శక్తివంతమైనవి కానున్నాయి. అలాగే, ఈ లోకోమోటివ్స్‌ను విదేశాలకు ఎగుమతి చేసే లక్ష్యంతో తయారు చేయనున్నారు. తద్వారా ఇది "మేక్ ఫర్ వరల్డ్" కార్యక్రమానికి తోడ్పాటునివ్వనుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ సహా తదితరులు పాల్గొన్నారు.

**10 వేల ఉద్యోగాలు..**

ఈ లోకోమోటివ్స్ రెజెనరేటివ్ బ్రేకింగ్ టెక్నాలజీతో రూపొందించబడ్డాయి. ఇవి శక్తి వినియోగాన్ని తగ్గించి పర్యావరణానికి అనుకూలంగా ఉంటాయి. అలాగే, డిజిటల్ ట్రాకింగ్ సిస్టమ్ (కవచ్) వంటి ఆధునిక సాంకేతికతలు ఈ లోకోమోటివ్స్‌లో అమర్చబడ్డాయి. ఇవి రైల్వే భద్రతను మరింత పెంచుతాయి. ఈ ప్లాంట్ ప్రారంభంతో దాహోద్ ప్రాంతంలో దాదాపు 10,000 కొత్త ఉద్యోగాలు సృష్టించబడతాయి. అందులో 3,500 ప్రత్యక్ష, 7,000 పరోక్ష ఉద్యోగాలు ఉంటాయి. ఈ ప్లాంట్ స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు యువతకు ఉద్యోగ అవకాశాలను అందిస్తుంది.

# ఊపిరి పీల్చుకున్న నాసా : ఎవరీ యువరాజ్ గుప్తా

మట్టిలో పుట్టిన మాణిక్యాలకు మన దేశంలో కొదువ లేదు. చిన్న వయసులోనే అత్యద్భుతమైన నైపుణ్యంతో అబ్బుర పరచడమే కాదు, అరుదైన ఘనతను సొంతం చేసుకుంటారు. అలాంటి రత్నం లాంటి వ్యక్తి గురించి తెలుసుకుందామా. మహా మహా నిపుణులే కనిపెట్టలేని బగ్‌ను గుర్తించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఒకప్పుడు తన పొరుగువారి %ఔఱ-ఖీఱ% ని హ్యాక్ చేసి దానితో ఆడుకునే ఆ పిల్లవాడు, నేడు %చీూూ% వంటి ప్రపంచంలోని అతిపెద్ద అంతరిక్ష సంస్థ వెబ్‌సైట్‌ను సైబర్ దాడుల నుండి రక్షించాడు కాన్పూర్‌కు చెందిన యువరాజ్ గుప్తా తన సామర్థ్యాలతో ప్రపంచం మొత్తాన్ని ఆశ్చర్యపరిచాడు. ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన 11వ తరగతి విద్యార్థి యువరాజ్ గుప్తానేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) వెబ్‌సైట్‌లో తీవ్రమైన భద్రతా లోపాన్ని కనుగొన్నాడు. ఈ బగ్ ద్వారా, ఎవరైనా అధికారిక ఇమెయిల్ నుండి నకిలీ సందేశాలను పంపవచ్చు. ఎంతోమంది సైబర్ నిపుణులు ఈ లోపాన్ని పట్టుకోలేకపోయారు, కానీ యువరాజ్ దాన్ని గుర్తించడం విశేషంగా నిలిచింది. బగ్ బౌంటీ కార్యక్రమంలో దాదాపు రెండు వారాల పాటుప్రయత్నించిన , ఇక ఆశ వదిలేసుకుంటున్న సమయంలో ఒక రాత్రి అతను సబ్ డొమైన్‌లో లోపాన్ని కనుగొన్నాడు. దీనిపై సమగ్ర నివేదికను తయారు చేసి వీడియోతో పాటు నాసాకు పంపించాడు. ఇది మాత్రమే కాదు, అతను నకిలీ ఈమెయిల్స్, రహస్య సమాచారాన్ని చేరవేసే బగ్‌ల గురించి తెలియజేశాడు. యువరాజ్ గుప్తా సాధించిన ఈ ఘనతకు నాసా గుర్తించింది. యువరాజ్‌ను ప్రశంసా పత్రం , 'హాల్



ఆఫ్ ఫేమ్'లో స్థానం కల్పించి సత్కరించింది. కాన్పూర్‌లోని సరస్వతి విద్యా మందిర్ ఇంటర్ కాలేజీ (దామోదర్ నగర్)లో చదువుతున్నాడు . 10వ తరగతిలో 79.4 శాతం మార్కులు సాధించాడు. పరిమిత వనరులు ఉన్నప్పటికీ, అతను యూట్యూబ్, ఆన్‌లైన్ కోర్సులు, పుస్తకాల ద్వారా ఎథికల్ హ్యాకింగ్‌పై పట్టు సాధించాడు. 6వ తరగతిలో ఉన్నప్పటినుంచీ సైబర్ సెక్యూరిటీపై ఆసక్తి పెంచుకున్నాడు. పట్టువదలకుండా ఎథికల్ హ్యాకింగ్‌లో నైపుణ్యాన్ని సాధించాడు. తాజాగా తన నైపుణ్యంతో నాసాను ఇంప్రెస్ చేయడం విశేషం. యువరాజ్ గుప్తా తండ్రి జై నారాయణ్ గుప్తా ఒక ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి. తల్లి కల్పనా గుప్తా గృహిణి. యువరాజ్ కు ల్యాప్ టాప్ ఇవ్వడానికి, అతని సోదరి స్కాలర్‌షిప్ , అతని తండ్రి పొదుపు మొత్తాన్ని కలిపి మొత్తం సిస్టంను సమకూర్చుకున్నాడట. దేశానికి డిజిటల్ భద్రతను అందించాలనే సంకల్పంతో ఉన్నామంటోంది యువరాజ్ కుటుంబం.

# యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ..!

పాకిస్తాన్ కోసం గూఢచర్యానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై అరెస్టయిన యూట్యూబర్ జ్యోతిని పోలీసులు హిసార్ కోర్టుకు తరలించారు. సివిల్ జడ్జి సునీల్ కుమార్ కోర్టులో జ్యోతి మల్హోత్రాను హాజరుపరుచగా.. న్యాయమూర్తి ఆమెకు 14 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ విధించారు. ఆమెను హిసార్ సెంట్రల్ జైలు నంబర్-2లో ఉంచనున్నారు. ఇది మహిళల జైలు. విచారణ సమయంలో కోర్టు లోపల గేట్లు మూసివేశారు. భారీ పోలీసు బలగాలను మోహరించారు. జ్యోతిని గతంలో ఐదు రోజుల రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. తాజాగా గడువు ముగిసిన నేపథ్యంలో కోర్టులో హాజరుపరిచారు. ఇదిలా ఉండగా.. జ్యోతి మొబైల్ కాల్ వివరాలు తొలగించినట్లుగా పోలీసులకు నివేదిక అందింది. అయితే, ల్యాప్‌టాప్ నుంచి తొలగించిన డేటా కోసం ఫోరెన్సిక్‌కు పంపగా.. నివేదిక ఇంకా అందలేదని అధికార వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా.. పాక్ కోసం గూఢచర్యం చేసిందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు సంబంధించి కీలక విషయం వెలుగులోకి వచ్చింది. పాకిస్తాన్ పర్యటనలో అక్కడి అధికారులు రాచమర్యాదులు చేసినట్లు తెలుస్తున్నది. లాహోర్‌లోని అనార్కలీ బజార్‌ని సందర్శించిన సమయంలో




యూట్యూబర్‌కు ఏకంగా ఆరుగురు గన్‌మెన్లు ఏకే 47తో భద్రత కల్పించినట్లుగా తేలింది. స్కాట్లాండ్‌కు చెందిన ఓ యూట్యూబర్ వీడియోతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. జ్యోతికి కల్పించిన సెక్యూరిటీని చూసి స్కాట్లాండ్ యూట్యూబర్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. 'కాలమ్ అబ్రాడ్' అనే యూట్యూబర్ స్కాటిష్ పౌరుడు కాలమ్ మిల్ గత మార్చి నెలలో పాక్‌లో పర్యటించారు. లాహోర్‌లోని ప్రసిద్ధ అనార్కలీ బజార్‌లో తిరుగుతుండగా.. అక్కడ కొందరు తుపాకులతో కనిపించారు. వారి చొక్కాలపై 'నో ఫియర్' అని రాసి ఉంది. వారితో జ్యోతి మల్హోత్రా వీడియో రికార్డ్ చేస్తూ కనిపించింది. కాలమ్ మిల్ తనను తాను పరిచయం చేసుకుని, పాకిస్తాన్‌కు రావడం ఇది ఐదోసారని చెప్పింది. జ్యోతి తాను భారతీయురాలినని పరిచయం చేసుకోగా.. పాక్ ఆతిథ్యంపై ప్రశ్నించా.. 'చాలా బాగుంది' అంటూ జ్యోతి బదులిచ్చింది. జ్యోతి మల్హోత్రా ముందుకు వెళ్తున్న సమయంలో ఆ సాయుధ వ్యక్తులు ఆమెతోనే ఉన్నారని కాలమ్ మిల్ గుర్తించి.. ఆమెకు తుపాకులతో అంత భద్రత కల్పించాల్సిన అవసరం ఏంటీ? అంటూ వీడియోలో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాలమ్ మిల్ ఎలాంటి భద్రత లేకుండా ఒక్కరే తిరగ్గా.. జ్యోతి మల్హోత్రాకు ఇంత భారీ భద్రత ఎందుకన్నది చర్చనీయాంశంగా మారింది. అయితే, సాయుధులు యూనిఫాంలో లేనప్పటికీ మఫ్తీలో ఉన్న భద్రతా సిబ్బంది అయి ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ వీడియోతో జ్యోతికి పాకిస్తాన్‌లో ఎలాంటి పరిచయాలు ఉన్నాయో తెలుస్తున్నది. పాక్‌లో ఉన్నతస్థాయి పార్టీలకు హాజరై, అక్కడి భద్రత, నిఘా అధికారులను కలిసినట్లు అనుమానిస్తున్నారు. భారత్‌కు తిరిగివచ్చాక సైతం వారికి టచ్‌లో ఉన్నట్లు పోలీసుల విచారణలో ఆమె చెప్పినట్లు తెలుస్తున్నది.

## జడ్జి నోట్ల కట్టల వ్యవహారం.. ఆ లేఖలో వివరాలను బహిర్గతం చేయలేం



**న్యూఢిల్లీ:** ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ 'నోట్ల కట్టల' వ్యవహారంలో ఇవాళ కీలక మలుపు చోటు చేసుకుంది. కోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ రూపొందించిన నివేదికను బహిర్గతం చేయడం కుదరదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న టైంలో ఆయన అధికారిక బంగ్లాలో అగ్నిప్రమాదం చోటు చేసుకోగా.. మంటలర్పిన ఫైర్, పోలీస్ పోలీస్ సిబ్బందికి కాలిన నోట్ల కట్టలు కనిపించడం, ఆ వ్యవహారం బయటకు పొక్కడం సంచలనంగా మారింది. ఈ వ్యవహారంపై కోర్టు నియమించిన కమిటీ విచారణ జరిపి నివేదికను అందజేసింది కూడా. అయితే.. అందులో విషయాలను బహిర్గతం చేయాలంటూ ఆర్టీఐ వ్యవస్థ ద్వారా న్యాయస్థాన సమాచార అధికారికి దరఖాస్తు అందింది. అయితే సెంట్రల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ఈ దరఖాస్తును తిరస్కరిస్తూ.. ఆర్టీఐ యాక్ట్‌లోని సెక్షన్ 8(1)(%వ%) కింద సమాచారం అందించలేమని స్పష్టం చేశారు. ఈ క్రమంలో 2019 సంచలన తీర్పును న్యాయస్థానం ప్రస్తావించింది. సుభాష్ చంద్ర అగర్వాల్ కేసులో.. రాజ్యాంగ పరిధిలో గోప్యత హక్కు, సమాచార హక్కు ఈ రెండింటి సమతుల్యత అవసరమని కోర్టు వ్యాఖ్యానించింది. మార్చి 14వ తేదీన జడ్జి ఊళ్లో లేని టైంలో బంగ్లాలో ఫైర్ యాక్సిడెంట్ చోటు చేసుకుని కాలిన నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఈ వ్యవహారంలో ఆరోపణలు రావడంతో ఆయన్ని అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. అయితే అలహాబాద్ బార్ అసోషియేషన్ నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో.. బదిలీ చేసినప్పటికీ విధులేవీ ఆయనకు అప్పగించలేదు. అంతేకాదు.. మునుపెన్నడూ లేని రీతిలో ఆ ఇంట్లో బయటపడ్డ నోట్ల కట్టల ఫొటోలు, వీడియోలను సుప్రీం కోర్టు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి ఆసక్తికర చర్చకు దారి తీసింది. అటుపై మార్చి 22వ తేదీన జడ్జి వర్మ నోట్ల కట్టల వ్యవహారంపై అంతర్గత విచారణకు ముగ్గురు జడ్జిలతో కూడిన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ మే 3వ తేదీన తుది నివేదిక రూపొందించగా.. ఆ మరుసటి రోజు ఆనాడు సీజేఐగా ఉన్న సంజీవ్ ఖన్నాకు నివేదిక అందజేసింది. దానిని సీజేఐ ఓ లేఖ ద్వారా రాష్ట్రపతి, ప్రధాన మంత్రికి తెలియజేశారు. మరోవైపు తనపై వస్తున్నవి కేవలం ఆరోపణలేనని జస్టిస్ వర్మ మొదటి నుంచి చెబుతూ వస్తున్నారు.

## మళ్లీ భయపెడుతున్న కరోనా!



గత నెలన్నరగా కరోనా కొత్త వేరియంట్ జేఎన్.1 ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నది. ఇప్పటి వరకు నిర్వహించిన అధ్యయనాల్లో ఒమిక్రాన్ ఇతర వేరియంట్స్ కన్నా ఇన్ఫెక్షన్ రేటు ఎక్కువగా ఉన్నప్పటికీ.. తీవ్రమైన సమస్యలు వచ్చే ప్రమాదం తక్కువగా ఉన్నట్లు నిపుణులు గుర్తించారు. అమెరికా, సింగపూర్ వంటి దేశాల్లో ఈ వేరియంట్ కారణంగా కేసులు వేగంగా పెరుగుతున్నట్లు తేలింది. ఆయా దేశాల్లో ఆసుపత్రుల్లో చేరిన రోగుల సంఖ్య పెరిగింది. ఈ వేరియంట్ కారనంగా జనవరిలో చైనాలో మరోసారి ఇన్ఫెక్షన్ పెరుగుదల ఉండవచ్చని నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా జేఎన్.1 వేరియంట్ ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సమస్యలను పెంచుతుంది. అయితే, భారత్‌లో పరిస్థితిని పరిశీలిస్తే.. గత రెండు, మూడురోజులుగా ఇన్ఫెక్షన్ కేసుల్లో తగ్గుదల ఉన్నట్లు తెలిసింది. 20 రోజుల కిందట రోజుకు 500-600 మందికి వైరస్ సోకగా.. ప్రస్తుతం రోజుకు సగటున 300 తగ్గింది. కొత్త వేరియంట్ కారణంగా గత నెల రోజుల నుంచి దేశంలో కొవిడ్ పరీక్షలు పెరిగాయి. అయితే, అందరూ కొవిడ్ పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం లేదని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుత సమయంలో దగ్గు, జలుబు కారణంగా కేసులు పెరుగుతున్నాయని.. ఈ క్రమంలో ప్రతీది కొవిడ్ అనుకోవాల్సిన అవసరం లేదని తెలుపుతున్నారు. ప్రస్తుతం పలు రాష్ట్రాలు కొవిడ్ పరీక్షలకు సంబంధించి మార్గదర్శకాలను జారీ చేశాయి. వైరస్‌తో సోకిన తర్వాత లక్షణాలు అభివృద్ధి చెందేందుకు ఇంక్యుబేషన్ పీరియడ్ ఉంటుందని.. ప్రతి ఇన్ఫెక్షన్‌కు ఇంక్యుబేషన్ పీరియడ్ భిన్నంగా ఉంటుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. కోవిడ్ రోగులకు చికిత్స చేసే ఇంటెన్సివ్ కేర్ డాక్టర్ వినీత్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. కరోనావైరస్ యొక్క ఇంక్యుబేషన్ పీరియడ్ 4-10 రోజులు ఉంటుందని చెప్పారు. గతంలో వచ్చిన కరోనా వేరియంట్ల తరహాలోనే ఈ వేరియంట్‌తో ఇన్ఫెక్షన్ కూడా లక్షణాలను చూపించడానికి చాలా సమయం పడుతుందన్నారు. సాధారణంగా ఇన్ఫెక్షన్ లక్షణాలు 6-8 రోజుల్లో మరింత స్పష్టంగా కనిపించడం జరుగుతుందన్నారు. కరోనా లక్షణాలు కూడా కనిపిస్తే.. ఇంక్యుబేషన్ పీరియడ్ వరకు వేచి ఉంటే.. పరీక్షల ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్నారు.

## జూన్ 2న జేఈఈ ఫలితాలు

**కాన్పూర్ :** దేశ వ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు మే 18న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షకు సంబంధించిన రెస్పాన్స్ షీట్‌లతోపాటు ప్రాథమిక ఆన్సర్ కీని తాజాగా ఐఐటీ కాన్పూర్ విడుదల చేసింది. పరీక్ష రాసిన అభ్యర్థులు తమ వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని వీటిని డైన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 18న రెండు షిఫ్టుల్లో జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష దేశ వ్యాప్తంగా నిర్వహించింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి షిఫ్టు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో షిఫ్టులో ఈ పరీక్షలను ఐఐటీ కాన్పూర్ నిర్వహించింది. తాజాగా విడుదలైన ఆన్సర్ కీపై అభ్యంతరాలను స్వీకరించిన తర్వాత తుది ఆన్సర్ కీని రూపొందిస్తారు. అనంతరం జూన్ 2వ తేదీన ఉదయం 10 గంటలకు తుది కీతోపాటు ఫలితాలు విడుదల చేయనున్నారు. అనతంరం జూన్ 3 సాయంత్రం 5 గంటలు జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణులైన వారికి బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్టు (ఏఏటీ 2025) పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష జూన్ 5వ తేదీన నిర్వహించనున్నట్లు ఇప్పటికే ఐఐటీ కాన్పూర్ స్పష్టం చేసింది.

# తెలంగాణలో కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఫిక్స్!

-మొదటిపేజీ తరువాయి

ఎస్టీ కోటాలో రామచంద్రనాయక్, బాలు నాయక్ పేర్లు పరిశీలనలో ఉండగా.. ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్ సాగర్ రావు రేసులో ఉన్నారు. త్వరలోనే మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అన్నారు. ఈ అంశంపై రాహుల్ తో కేసీ వేణుగోపాల్ సుదీర్ఘంగా చర్చించారన్నారు. కేబినెట్ విస్తరణపై మా అభిప్రాయాలు ఇప్పటికే చెప్పాం. రేపో, మాపో టీపీసీసీ కార్యవర్గం ప్రకటన కూడా ఉంటుందని ఆయన తెలిపారు. పీసీసీ కార్యవర్గ ఏర్పాటు, జై భీమ్ జై సంవిధాన తదితర అంశాలపై చర్చించానని మహేష్ గౌడ్ తెలిపారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో కేసీ వేణుగోపాల్, మహేష్ కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. మర్యాద పూర్వకంగా కుటుంబ సమేతంగా రాహుల్ గాంధీని కలిశాను.. తెలంగాణ రాష్ట్ర అంశాలను రాహుల్ గాంధీకి వివరించానని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. వీలైనంత త్వరగా క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ చేయాలని రాహుల్ గాంధీని కోరా.. త్వరగా చేస్తామని చెప్పారు. ఇవాళ, రేపటిలోగా పీసీసీ కార్యవర్గ ప్రకటన ఉంటుంది. మంత్రివర్గ విస్తరణకు సంబంధించి ఇప్పటికే ఒకటి రెండు, సార్లు మా అభిప్రాయాలను అధిష్ఠానానికి తెలిపాం. తెలంగాణ క్యాబినెట్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని అధిష్ఠానాన్ని కోరాం" అని మహేష్ గౌడ్ వెల్లడించారు.

సామాజికవర్గాల వారీగా కసరత్తు

పీసీసీ కార్యవర్గం ఎంపికకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించినట్టు ఆ పార్టీ వర్గాల తాజా సమాచారం. ఈ నెలాఖరున పీసీసీ కార్యవర్గాన్ని ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. మంత్రివర్గ విస్తరణను కూడా అధిష్ఠానం తేల్చేపనిలో ఉన్నట్లు తెలిసింది. నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొనడానికి ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం సాయంత్రం ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. సుమారు గంటకు పైగా వీరి మధ్య చర్చలు సాగాయి. రేవంత్‌తో పాటు పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఉన్నారు.సోమవారం ఉదయం వేణుగోపాల్‌తో కలిసి రాహుల్‌గాంధీని కూడా సీఎం రేవంత్‌రెడ్డి కలువనున్నారని తెలిసింది. అలాగే మంగళవారం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే అపాయింట్‌మెంట్ లభించడంతో మరో రెండు రోజుల పాటు సీఎం రేవంత్‌రెడ్డి



ఢిల్లీలోనే ఉంటారని తెలిసింది. మూడు రోజులుగా ఢిల్లీలో మకాం వేసిన పీసీసీ అధ్యక్షు డు మహేశ్‌కుమార్‌గౌడ్ ఇప్పటికే పీసీసీ కార్యవ ర్గం ఎంపికపై తమ ప్రతిపాదనలను పార్టీ పెద్దల ముందు ఉంచినట్టు తెలిసింది. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని కూడా కలిసి కార్యవర్గం ఎంపి క ప్రతిపాదనలపై మహేశ్‌కుమార్‌గౌడ్ చర్చించినట్లు తెలిసింది.పీసీసీ అధ్యక్షుడు, అధిష్ఠానం సంయుక్తంగా చేసిన కసరత్తుపై తుదిగా సీఎం రేవంత్‌రెడ్డితో అధిష్ఠానం చర్చించాక, పీసీసీ కా ర్యవర్గం, మంత్రివర్గ విస్తరణ రెండింటిపై స్పష్టత రానున్నదని ఈ వర్గాల సమాచారం. పీసీసీ కా ర్యవర్గం ఖరారు దాదాపు ఒక కొలిక్కి రావడంతో ఈ నెలాఖరున ప్రకటించే అవకాశం ఉన్నట్లు తె లిసింది. ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు ఈ మూడు పదవుల్లో ఉన్న సామాజిక వర్గాలను దృష్టిలో పెట్టుకొని పార్టీ లో, ప్రభుత్వంలో ప్రాతినిధ్యం లభించని సామాజిక వర్గాలకు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా అవకాశం కల్పించబోతున్నట్లు తెలిసింది. ఎస్సీ, ఎస్సీ (మాదిగ), మైనార్టీ ఈ మూడు సామాజిక వర్గాలకు చెందిన వారికి వర్కింగ్ ప్రెసిడెంట్లుగా అవకాశం దక్కబోతున్నట్లు తెలిసింది. అలాగే కార్యవర్గంలో కీలకమైన ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులుగా సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకొని కసరత్తు చేసినట్లు తెలిసింది.

వచ్చే నెలలో మంత్రివర్గ విస్తరణ?

పీసీసీ కార్యవర్గం ఎంపిక కొలిక్కి రావడంతో పార్టీ అధిష్ఠానం మంత్రివర్గ విస్తరణపై ఇక దృష్టి సారించినట్టు తెలిసింది. ఈ నెలాఖరున పీసీసీ కార్యవర్గాన్ని ప్రకటించి, వచ్చే నెల జూన్ మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణకు అధిష్ఠానం సూచనప్రాయంగా అంగీకరించినట్లు ఆ వర్గాల సమాచారం. మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించే అంశం వల్లనే జాప్యానికి కారణంగా చెబుతున్నారు.డిప్యూటీ సీఎం, స్పీకర్ రెండు కీలక పదవులు మాల సామాజిక వర్గానికి అవకాశం కల్పించడంతో కనీసం మంత్రివర్గంలో అయినా తమకు ప్రాధాన్యత కల్పించాలని మాదిగ సామాజిక వర్గం చేస్తోన్న డిమాండ్‌ను అధిష్ఠానం సీరియస్‌గా తీసుకొని ఆ దిశగా కసరత్తు చేస్తోన్నట్టు తెలిసింది. మంత్రివర్గంలో ఇప్పటికే మాదిగ సామాజిక వర్గం నుంచి మంత్రి దామోదర రాజనరసింహకు ప్రాతినిధ్యం కల్పించినప్పటికీ ఆయన తమ సామాజిక వర్గం కాదని ఆరుగురు మాదిగ సామాజిక వర్గం ఎమ్మెల్యేలు వాదనతో అధిష్ఠానం ఏకీభవించినట్లు తెలిసింది. దీంతో మాదిగ సామాజిక వర్గం నుంచి మంత్రివర్గంలోకి ఎవరిని తీసుకోవాలనే అంశంపై సందిగ్ధత నెలకొన్నట్లు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఢిల్లీకి వెళ్లిన సందర్భంగా ఆరుగురు మాదిగ ఎమ్మెల్యేలు మరోసారి తమ డిమాండ్‌పై అధిష్ఠానంతో చర్చించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మరోవైపు అధిష్ఠానం పెద్దలకు కూడా లిఖిత పూర్వకంగా వారు లేఖ రాశారు.మంత్రివర్గ విస్తరణలో తమ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలని మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు అధిష్ఠానానికి విజ్ఞప్తి చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం లేఖ అందజేసిన విషయం తెలిసిందే. వీరిలో ఎమ్మెల్యేలు మందుల సామేల్ (తుంగతుర్తి), కవ్వంపల్లి సత్యనారాయణ (మానకొండూరు), వేముల వీరేశం (నకిరేకల్), తోట లక్ష్మీకాంతారావు (జుక్కల్), అద్దూరి లక్ష్మణ్ కుమార్ (ధర్మపురి), కాలె యాదయ్య (చేవెళ్ల)లు ఉన్నారు. తమ కోటాలో మంత్రివర్గంలో ఉన్న దామోదర రాజనర్సింహా మాదిగ కాదని, ఆయనది ఉపకులమని వారు తమ లేఖలో పేర్కొన్నారు. మాదిగ సామాజిక వర్గ జనాభా రాష్ట్రంలో 2011 జనగణన ప్రకారం 33 లక్షల మంది ఉన్నారని, మాలలకు డిప్యూటీ సిఎం, స్పీకర్ పదవి దక్కడంతో మంత్రివర్గంలో అయినా తమకు చోటు కల్పించాలని ఆ లేఖలో వారు పేర్కొన్నారు.

# టాలీవుడ్ పెద్దలు రాజకీయం

హైదరాబాద్ : టాలీవుడ్ పెద్దల తీరుతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అసంతృప్తికి గురయ్యారు. గత ప్రభుత్వం ఎంత వేధిం చినా.. ప్రస్తుత ప్రభుత్వం టాలీవుడ్ సమస్యల పట్ల ఎంతో సానుకూలంగా ఉంది. ఎలాంటి ప్రతిపాదన వచ్చినా అంగీకారం తెలియచేస్తోంది. అయినప్పటికీ టాలీవుడ్ ప్రభుత్వం, ప్రభుత్వ పెద్దల పట్ల వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. సినీ పరిశ్రమ వైపు నుంచి కుట్రలు చేయడానికి కూడా వెనుకాడటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం సినీ పరిశ్రమను చూసే విధానం కూడా మారే సూచనలు కనిపిస్తున్నాయి. దీనంతటికి కారణం సినీ పరిశ్రమ పెద్దలే. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో టాలీవుడ్ చాలా సమస్యలు ఎదుర్కొంది. మినిమం టిక్కెట్ రేటును పది రూపాయలుగా ఖరారు చేశారు. అక్కడి నుంచి మెగాస్టార్ చిరంజీవి చేతులు జోడించి జగన్ ను వేడుకునే వీడియో విడుదల చేయడం వరకూ టాలీవుడ్ అనేక అవమానాలు ఎదుర్కొంది. టిక్కెట్ రేట్లు పెంచాలంటే.. హీరోలు వచ్చి వ్యక్తిగతంగా కలిసి దండాలు పెట్టుకుని వెళ్లాల్సిన అవసరం ఉండేదన్న విమర్శలు వచ్చాయి. చివరికి టిక్కెట్ రేట్లను పెంచడానికి అనేక షరతులు పెట్టారు. వ్యక్తిగతంగా వచ్చి కలిస్తేనే టిక్కెట్ రేట్లు పెంచుకోవడానికి జీవోలు వచ్చేవి.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సినీ పరిశ్రమకు ప్రోత్సాహం లభిస్తోంది. ఇండస్ట్రీ గుర్తింపు ఇస్తామని కూడా ప్రభుత్వం టాలీవుడ్ పెద్దలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో కొంత మంది టాలీవుడ్ పెద్దలు పవన్ కళ్యాణ్ తో సమావేశమయ్యారు. అప్పటి నుంచి సినీ పరిశ్రమకు సంబంధించి ఎలాంటి అవసరాన్ని అయినా ప్రభుత్వం పరిష్కరిస్తోంది. టిక్కెట్ రేట్ల పెంపుదల జీవోలు ఇస్తోంది. షూటింగ్‌లకు అనుమతుల విషయంలో ఆలస్యం కావడం లేదు. స్వయంగా టాలీవుడ్ అగ్రహీరో డిప్యూటీ సీఎంగా ఉండటంతో సమస్యలు ఉండవనుకున్నారు. కానీ ఇప్పుడు కొంత మంది డిప్యూటీ సీఎం సినిమానే టార్గెట్ చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. థియేటర్లు యజమానుల చేతుల్లో లేవు. నలుగురు చేతుల్లోనే ఉన్నాయి. ఇప్పుడు ఆ నలుగురు కలిసి థియేటర్లు మూసేద్దామని ప్లాన్ చేశారు. అది కూడా పవన్ సినిమా ఎదురుగా ఉన్న సమయంలో. దీంతో కుట్రలేమిటో అర్థమైపోయింది. టాలీవుడ్ మీద గత ప్రభుత్వం కుట్రలు చేస్తూంటే.. ఈ ప్రభుత్వంపైనే టాలీవుడ్ పెద్దలే కుట్రలు చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై స్పష్టమైన అవగాహన ఉండటంతో పవన్ కళ్యాణ్ కూడా అసహనానికి గురవుతున్నారని అంటున్నారు. అందుకే తమకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలనుకున్నారని ఆయన సర్కాస్టిక్‌గా వ్యాఖ్యానిస్తున్నారు. థియేటర్ల విషయంలో చర్యలకు పవన్ సిద్ధమయ్యారు. ఇప్పటి వరకూ టాలీవుడ్ పెద్దలంతా కలిసి చంద్రబాబును కలవకపోవడంతో వారి ఇంటెన్షన్ ఏమిటో తెలిసిపోతుందని అంటున్నారు. ఏపీ ప్రభుత్వం పట్ల సినిమా పెద్దలు వ్యవహరిస్తున్న తీరు చూసిన తర్వాత చాలా మంది.. జగన్ లా ఉంటేనే సినిమావాళ్లకు తిక్క కుదురుతుందని మంచిగా ఉంటే ఇలాగే రాజకీయ కుట్రల్లో భాగమవుతూంటారన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇండస్ట్రీ మొత్తం నలుగురి చేతుల్లో ఉందని..వారంతా కలిసి ఈ పనులు చేస్తున్నారని అంటున్నారు. టాలీవుడ్ నిర్మాతలు అడిగినట్లు టికెట్ రేట్స్ పెంచుతూ... అడిగినన్ని షోలకు అనుమతులు ఇవ్వడంలో పవన్ కళ్యాణ్ ఎటువంటి అభ్యంతరాలు పెట్టకుండా ముందుకు వెళుతుంటే... ఆయన సినిమా విడుదల సమయంలో అడ్డంకులు సృష్టించడం పట్ల ఘాటుగా స్పందించారు. టాలీవుడ్ ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్‌ను స్వీకరించినట్లు తెలిపారు. అలాగే, థాంక్స్ చెప్పారు. ఇప్పటినుంచి వ్యక్తిగత హోదాలో వచ్చే టాలీవుడ్ నిర్మాతలను కలిసేది లేదని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఎటువంటి చర్చలకు తావు లేదని స్పష్టం చేశారు. సంబంధిత విభాగం ప్రతినిధులతోనే చర్చిస్తా మని వివరించారు. సినిమా రంగాన్ని అభివృద్ధి చేయదానికి ప్రత్యేక పాలసీ తీసుకు రావాలని పవన్ కళ్యాణ్ డిసైడ్ అ య్యారు. థియేటర్ల ఆదాయం, వాటి వసతుల మీద నివేదిక ఇవ్వాలని అధికారులను కోరారు.ఏపీలోని థియేటర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఒక గ్రూపుగా ఏర్పడి చేస్తున్న వ్యవహారాలతో పాటు ప్రేక్షకులు పెడుతున్న టికెట్ రేటు, అందుకు పొందుతున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయి? వంటి అంశాలను సంబంధిత అధికారులతో పవన్ కళ్యాణ్ ఇప్పటికే చర్చించారు" అని ఏపీ ఉప ముఖ్యమంత్రి కార్యాలయం పేర్కొంది. థియేటర్ల లీజుకు తీసుకున్న వ్యక్తుల నుంచి పన్ను సక్రమంగా వస్తుందా? లేదా? టికెట్ రేట్స్ పెంచినప్పుడు అందుకు తగ్గట్టుగా పన్ను కట్టారా? లేదా? అనేది చూడమని ఆదేశించారు. పార్కింగ్ ఫీజ్ నుంచి పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ వరకు ఎక్కువ రేటుకు అమ్మడం పట్ల అధికారులు తనిఖీలు చేయాలని ఆదేశించారు.

# ఆ నలుగురిపైనే చర్చ అంతా

హైదరాబాద్ : తెలుగు సినిమా ఇండస్ట్రీలో ప్రొడ్యూస్ చేయడం నుంచి ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ వరకు అన్ని రంగాల్లో ఉన్న నిర్మాతలు కొందరు ఉన్నారు. అయితే... సురేష్ బాబు, అల్లు అరవింద్, దిల్ రాజు, ఏషియన్ సునీల్ – ఈ నలుగురు మిగతా నిర్మాతలకు చాలా అందనంత ఎత్తులో ఉన్నారు. సురేష్ బాబు చేతిలో రామానాయుడు స్టూడియో ఉంది. ఫిల్మ్ షూటింగ్స్ అండ్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ అందులో చేసుకోవ చ్చు. 'మిస్ ఇండియా' సినిమాలో కీర్తి సురేష్ రెస్టారెంట్ పెడతారు కదా... అమెరికాలో! ఆ సెట్ హైదరాబాద్ రామానాయుడు స్టూడియోస్‌లో వేశారు. 'టాక్సీవాలా'లో విజయ్ దేవరకొండ గ్యారేజ్ సెట్ కూడా సేమ్ ప్లేస్‌లో వేశారు. ఎన్నో సినిమాల్లో బస్ స్టాప్ సీన్స్ రామానాయుడులో తీశారు. అక్కడ ప్రివ్యూ థియేటర్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ చేసుకోవడానికి అవసరమైన సరంజామా ఉంది. సురేష్ బాబు దగ్గర డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థతో పాటు లీజుకు తీసుకున్న థియేటర్లు ఉన్నాయి.ఏషియన్ సునీల్ విషయానికి వస్తే... మహేష్ బాబు (ఏఎంబీ), అల్లు అర్జున్ (ఏఏఏ) వంటి స్టార్ హీరోల భాగస్వామ్యంతో మల్టీప్లెక్సులు స్టార్ట్ చేశారు. రవితేజతో వనస్థలిపురంలో ఒక మల్టీప్లెక్స్ కడుతున్నారు. మరికొంత మంది హీరోలతో అటువంటి వెంచర్స్ (మల్టీప్లెక్స్‌లు) ప్లాన్ చేశారు. ఎగ్జిబిషన్ సెక్టార్‌లో ఏషియన్‌కు బలమైన వ్యవస్థ ఉంది. గతంలో తెర వెనుక ఉన్న ఏషియన్ సునీల్, కొన్ని సంవత్సరాలుగా నిర్మాణంలోనూ అడుగు పెట్టారు. నాగచైతన్యతో 'లవ్ స్టోరీ', నాగార్జునతో 'ది ఘోస్ట్' తీశారు. ఇప్పుడు ధనుష్ – నాగార్జునల 'కుబేర' తీస్తున్నారు.మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్, అగ్ర నిర్మాత 'దిల్' రాజు గురించి చెప్పాల్సిన అవసరం లేదు... భారీ బడ్జెట్ ఫిలిమ్స్ నుంచి కాన్సెప్ట్ & కంటెంట్ ఓరియెంటెడ్ ఫిలిమ్స్ వరకు అన్నీ చేస్తున్నారు. ఇద్దరికీ డిస్ట్రిబ్యూషన్‌లో బలమైన నెట్వర్క్ ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో బోలెడు థియేటర్లు వాళ్ళ చేతుల్లో ఉన్నాయి.టాలీవుడ్ ఇండస్ట్రీలో 'ఆ నలుగురు' అంటే వినిపించేది వీళ్ళ పేర్లే. గతంలో నట్టి కుమార్ వంటి నిర్మాతలు 'ఆ నలుగురు' థియేటర్లను తమ గుప్పెట్లో పెట్టుకుని చిన్న సినిమాలకు ఇవ్వడం లేదని ఆరోపణలు చేసిన రోజులు ఉన్నాయి. అయితే చిన్న సినిమాలకు థియేటర్లు ఇచ్చినా ప్రేక్షకులు రావడం లేదని అగ్ర నిర్మాతలు చెబితే సమంజసం అనిపించింది కనుక ఎక్కువ విమర్శలు రాలేదు. నట్టి కుమార్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం కలగలేదు. ఇప్పుడు ఏకంగా పవన్ కళ్యాణ్ సినిమా విడుదలకు అడ్డుపడుతున్నారనే ప్రచారం మొదలైంది. దాంతో ఇప్పుడు ఈ వ్యవహారం వేడెక్కింది.డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలో 'దిల్' రాజు, అల్లు అరవింద్, ఏషియన్ సునీల్, సురేష్ బాబు కొన్నేళ్లుగా ఆధిపత్యం చెలాయిస్తున్నారు. వాళ్ళ దగ్గర ఎక్కువ థియేటర్లు ఉన్నాయి. సొంతంగా కట్టుకున్నవి కొన్ని అయితే... లీజుకు తీసుకుని మెయింటైన్ చేస్తున్నవి మరికొన్ని.గతంలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు ఉండేది. కానీ, ఇప్పుడు సురేష్ బాబు – ఏషియన్ సునీల్ కలిసి సినిమాలు డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. దిల్ రాజు ఒక్కోసారి వీళ్ళతో కలిసి సినిమాలు కొని విడుదల చేస్తారు. మెజారిటీ తమిళ్ డబ్బింగ్ సినిమాలు రిలీజ్ చేసేది వీళ్ళే. అల్లు అరవింద్ కూడా కొన్ని సినిమాలు డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. 'కాంతారా'ను తెలుగులో విడుదల చేసింది ఆయనే. 'చేబీ', 'పొలిమేర 2' వంటి సినిమాల విడుదల వెనుక ఉన్నది ఆయన గీతా ఫిలిమ్స్ డిస్ట్రిబ్యూషన్. ప్రొడ్యూసర్ చేతుల్లో ఏముంది కాయప్ప... డిస్ట్రిబ్యూటర్ చేసేది కాయప్పు... తమ తమ సినిమాలు థియేటర్లలోకి వచ్చేటప్పుడు ఒక విధంగా, తమ సినిమాలు లేనప్పుడు మరో విధంగా 'ఆ నలుగురు' వ్యవహరిస్తారని పేరుంది. ఏషియన్ సునీల్ ప్రొడ్యూస్ చేస్తున్న 'కుబేర' జూన్ 20న విడుదలకు సిద్ధమైనా... ఆ సినిమాను పక్కన పెడితే డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలో తమకు మేలు కలిగేలా నిర్ణయాలు తీసుకోవడం కోసం మిగతా మిత్రులతో కలిసి థియేటర్స్ బంద్ వ్యవహారాన్ని ముందుకు తెచ్చారని ఇండస్ట్రీలో గుసగుస. 'ఆ నలుగురు'లో వీళ్ళను ఎవరూ పైకి చెప్పరని, అది అందరికీ తెలిసిన ఓపెన్ సీక్రెట్ అని ఇండస్ట్రీ ఇన్‌సైడ్ టాక్. ఇప్పుడు ఏకంగా ఏపీ సినిమా టోగ్రఫీ మంత్రి నుంచి 'పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు విడుదలకు ముందు థియేటర్లు బంద్ చేయాలని ఆ నలుగురు ఒత్తిడి చేస్తున్నారని వార్తలు వస్తున్నా యి' అంటూ స్టేట్మెంట్ రావడం గమనార్హం. మరి పవన్ క్యాంప్ పేర్కొంటున్న 'ఆ నలుగురు' వీళ్లేనా? కాదా? అనేది తెలియాల్సి ఉంది.

## పదేళ్లలో గిరిజనుల గురించి కేసీఆర్ ఆలోచించారా?

-మొదటిపేజీ తరువాయి

ఉద్యోగులకు గత భారాస ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బకాయిలను క్రమంగా చెల్లిస్తున్నామన్నారు. "ఉద్యోగులకు రూ.10 వేల కోట్ల బకాయిలు ఉంటే రూ.8వేల కోట్లు చెల్లించాం. రాష్ట్రంలో ఇళ్లులేని కుటుంబం ఉండకూడదని ప్రభుత్వం ఆలోచిస్తోంది. రూ.5 లక్షలకు తగ్గకుండా ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులు ఇవ్వాలని ఆలోచిస్తున్నాం. విద్యావ్యవస్థను గాడిలో పెడుతున్నాం." అని భట్టి విక్రమార్క అన్నారు.

## కొత్త పార్టీ ఖాయమా?

-మొదటిపేజీ తరువాయి

కేసీఆర్‌కు లేఖ రాసిన కవిత సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఎల్కతుర్తిలో గత నెల 27న జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వచ్చిన స్పందన, తన తండ్రి కేసీఆర్ ప్రసంగం తీరుతెన్నులను విశ్లేషిస్తూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖ పార్టీలో కలకలం రేపిన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీ కవిత లేఖ, ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. అయితే, కవిత వ్యాఖ్యలపై పార్టీ అధినేత కేసీఆర్ సైతం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరిగింది. 'కేసీఆర్ దేవుడు.. ఆయన చుట్టూ దెయ్యాలు'ఉన్నాయంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ పరోక్ష వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు నిన్న(ఆదివారం) ఎర్రవల్లి ఫాంహౌస్‌కు వెళ్లిన కేటీఆర్.. తన తండ్రి కేసీఆర్‌తో భేటీ అయ్యారు. కవిత లేఖపై చర్చ జరిగినట్లు సమాచారం. కవిత లేఖ నేపథ్యంలో ఇద్దరి భేటీపై ఆసక్తి నెలకొంది. పార్టీలో అంతర్గతంగా మాట్లాడుకోవాల్సిన అంశాలను బహిరంగపరిచి క్యాడర్‌ను గందరగోళానికి గురి చేశారని కేసీఆర్‌కు కేటీఆర్ వివరించినట్లు సమాచారం.

## ఈ 2న పంచాయతీ ఎన్నికలపై ప్రకటన

-మొదటిపేజీ తరువాయి

పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఇతర ముఖ్య అధికారులతో మాట్లాడినట్లు అధికారవర్గాలు సైతం వెల్లడించాయి. ఏ సమయంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడవచ్చని, సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపాయి.

ఆలస్యమైతే మరింత నష్టం?

రాష్ట్రంలో స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు ముగిసి ఏడాది దాటిపోయింది. కేంద్రం, 15వ ఫైనాన్స్ నిధులు రాక గ్రామాల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన నిలిచింది. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి 15 నెలలు దాటింది. అయినా, ఎన్నికలు నిర్వహించక పోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్రామీణ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇంకా ఆలస్యమైతే మరింత నష్టం జరిగే అవకాశం ఉంటుందని ప్రభుత్వ పెద్దలకు ఫీడ్‌బ్యాక్ అందింది. ఫలితాలు ఎలా వచ్చినా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం ప్రభుత్వ పెద్దల వద్ద మొర పెట్టుకుంటున్నారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే ప్రజలు తమ సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్తారని, తమపై కాస్త ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నారు. వెంటనే ఎన్నికలకు వెళ్లాలని కొందరు ఎమ్మెల్యేలు ఒత్తిడి కూడా తీసుకొస్తున్నట్లు తెలిసింది. సన్నబియ్యం, రేషన్‌కార్డుల పంపిణీ, యువవికాసం వంటి పథకాల అమలు అంశం కలిసి వస్తుందని కూడా హస్తం నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఆ పథకాలపై ఇంటింటా ప్రచారం చేయాలని ఎమ్మెల్యేలకు సీఎం డిప్యూటీ సీఎం పలు సూచనలు ఇచ్చారు.

## కేటీఆర్‌కు అవినీతి నిరోధకశాఖ నోటీసులు

-మొదటిపేజీ తరువాయి

పర్యటన షెడ్యూల్ ఇప్పటికే ఖరారైనందున.. తిరిగి వచ్చిన తర్వాత హాజరవుతానని కేటీఆర్ బదులిచ్చారు. "రాజకీయ వేధింపుల్లో భాగంగానే నోటీసులు ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ కక్ష సాధింపు కోసం తహతహలాడుతున్నారు. 48 గంటల క్రితం ఈడీ ఛార్జిషీట్‌లో రేవంత్ పేరు వచ్చింది. 24 గంటల క్రితమే ప్రధాని సహా భాజపా అగ్రనేతలను రేవంత్ కలిశారు. ఇవాళ నాకు ఏసీబీ నుంచి నోటీసులు వచ్చాయి. మనీలాండరింగ్‌లో రేవంత్ ప్రమేయంపై భాజపా నుంచి ఒక్క మాట కూడా లేదు. రేవంత్‌రెడ్డి నాయకుడిగా, పాలకుడిగా విఫలమయ్యారు. అందుకే ఆయన కక్ష పూరిత చర్యలకు పాల్పడుతున్నారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా విచారణకు సహకరిస్తాను" అని కేటీఆర్ పేర్కొన్నారు. నోటీసులపై ఏసీబీకి లిఖిత పూర్వక సమాచారమిచ్చినట్లు ఆయన తెలిపారు.

కేటీఆర్‌కు అండగా ఉంటాం: హరీశ్‌రావు

ప్రతీకార రాజకీయాలు రేవంత్‌రెడ్డి అభద్రతా భావానికి స్పష్టమైన సంకేతాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కల్పిత కేసులు న్యాయస్థానాల్లో నిలవబోవని, ప్రజామోదాన్ని పొందవని చెప్పారు. కేటీఆర్‌కు అండగా నిలుస్తామని, సత్యమే గెలుస్తుందని తెలిపారు.

## దూరం ఆధారంగా టోల్...

ముంబై : కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై ప్రయాణాన్ని సరళీకృతం చేసేందుకు కొత్త టోల్ విధానంపై పనిచేస్తోంది. హైవేలపై ట్రాఫిక్ జామ్ కాకుండా టోల్ వసూలు విషయంలో అనేక సంస్కరణలు తీసుకువస్తోంది. శాటిలైట్ ఆధారిత టోల్ వసూలుకు కూడా ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో మరో వినూత్న



విధానం అందుబాటులోకి తెచ్చిందిదేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, రాష్ట్ర ఎక్స్‌ప్రెస్‌వేలపై అపరిమితంగా ప్రయాణించేందుకు కేంద్రం కొత్త, వినూత్న విధానం అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానం కింద, వాహనదారులు వార్షికంగా 3 వేల ??పాయలు చెల్లించి ఏడాదిపాటు టోల్ చెల్లించకుండా ప్రయాణం చేయవచ్చు. ప్రతి టోల్ గేట్ వద్ద విడిగా ఫీజు చెల్లించాల్సిన అవసరం లేకపోవడం వల్ల, ఈ పథకం వాహనదారులకు సమయం, ఖర్చు ఆదా చేస్తుంది. ప్రస్తుత ఫాస్ట్‌ట్యాగ్ వ్యవస్థతో ఈ ప్యాకేజీ అనుసంధానం అవుతుంది, కాబట్టి అదనపు డాక్యుమెంట్ల అవసరం లేదు. ఫాస్ట్‌ట్యాగ్‌ను రీఛార్జ్ చేయడం ద్వారా ఈ సౌలభ్యాన్ని పొందవచ్చు. ఈ విధానం దీర్ఘకాలిక ప్రయాణికులు, వ్యాపారవేత్తలకు ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.వార్షిక ప్యాకేజీతోపాటు, దూరం ఆధారిత టోల్ విధానం కూడా ప్రవేశపెట్టనుంది. ఈ విధానంలో, 100 కిలోమీటర్ల దూరానికి 50 రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. స్థానికంగా తరచూ ప్రయాణించే వాహనదారులు, చిన్న వ్యాపారులు ఈ ఎంపికతో ఆర్థిక భారం తగ్గించుకోవచ్చు. ఈ విధానం టోల్ చెల్లింపుల్లో పారదర్శకతను పెంచడమే కాక, టోల్ గేట్ల వద్ద రద్దీని తగ్గించడానికి దోహదపడుతుంది. అయితే, గతంలో ప్రతిపాదిత 30 వేల రూపాయలతో 15 ఏళ్లపాటు అపరిమిత ప్రయాణం అనే జీవితకాల ఫాస్ట్‌ట్యాగ్ ఆలోచనను ప్రభుత్వం విరమించుకుంది. దీనిని అమలు చేసే అవకాశం లేదని తెలుస్తోంది.ఈ కొత్త టోల్ విధానం జాతీయ రహదారులపై ట్రాఫిక్ జామ్‌లను తగ్గించి, డిజిటల్ చెల్లింపుల వినియోగాన్ని పెంచుతుందని అధికారులు ఆశిస్తున్నారు. ఫాస్ట్‌ట్యాగ్ వ్యవస్థ ద్వారా టోల్ సేకరణ సులభతరం కావడంతో, రహదారి నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు సమకూరుతాయి. ఈ పథకం రాష్ట్రాల సమన్వయంతో త్వరలో అమలులోకి రానుంది, ఇది విజయవంతమైతే రాష్ట్ర రహదారులకు కూడా విస్తరించే అవకాశం ఉంది. ఈ విధానం వాహనదారులకు ఆర్థిక సౌలభ్యం కల్పించడమే కాక, రహదారి రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మారుస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, ఈ పథకం అమలులో సాంకేతిక సమస్యలు, రాష్ట్రాల మధ్య సమన్వయం వంటి సవాళ్లను అధిగమించాల్సి ఉంటుంది.

# సంపాదకీయం

## కౌలు రైతులపై శీతకన్ను

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల తెలంగాణ రాష్ట్రంలో కౌలు రైతులు (%ఖీఘతీఎవతీం%) తీవ్ర సంక్షోభంలో ఉన్నారు. భూమిపై కౌలు హక్కులు లేకపోవటం వలన ప్రభుత్వ పథకాలకు, పంట నష్ట పరిహారాలకు, సంస్థాగత రుణాలకు దూరమవుతున్నారు. ముఖ్యంగా కౌలు భూమిని పొందటం భూకామందుల ఇష్టాలపై ఆధారపడవలసి వస్తున్నది. భారతదేశం వ్యవసాయిక దేశమని, వ్యవసాయం దేశానికి ఆయువు పట్టని పాలక పార్టీలతోపాటు ప్రతిపక్ష పార్టీలు నిత్యం జపించే మాటలుగా ఉన్నాయి. నేటికీ అత్యధిక ప్రజలకు జీవనాధారంగా ఉన్న వ్యవసాయ రంగం పరిస్థితి, వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తున్న కౌలు రైతులు, పేద రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం ఎడల పాలక పార్టీలు అనుసరిస్తున్న విధానాలు నేడు దేశంలో, రాష్ట్రంలో చర్చించాల్సిన అంశంగా ఉంది. వ్యవసాయానికి సేద్యపు భూమి పునాదిగా ఉంది. ఆ భూమి సేద్యం చేసే వారి వద్ద ఉందా లేక సేద్యం చేయని వారి వద్ద బందీగా ఉందా అన్నదే కీలక అంశం. ఈ అంశమే వ్యవసాయ రంగం స్వరూపాన్ని తెలియచేస్తుంది. అధికార మార్పిడి జరిగి 77 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత కూడా భూసంబంధాల్లో మౌలిక మార్పులు జరగలేదు. భూసంస్కరణ చట్టాలు పేదలకు భూములు పంచడంలో విఫలమై అలంకార ప్రాయంగానే ఉన్నాయి. సేద్యం చేసి పంటలు పండించే కౌలురైతుల, పేదరైతులకు సాగు భూమి లేదు. సేద్యం చేయని భూకామందుల వద్ద భూమి కేంద్రీకరణ జరిగింది. ఫలితంగా సేద్యం పై మక్కువ ఉన్న పేదలు భూకామందుల వద్ద భూమిని కౌలుకి తీసుకుని కౌలు దారులుగాను మరి కొందరు కూలీలుగా మారి భూకామందుల దోపిడీకి గురవుతున్నారు. అధికార మార్పిడి జరిగిన ప్రారంభంలో గ్రామీణ జనాభాలో 35% కౌలు రైతులే. కౌలుదారుకి సాగుదారుగా గుర్తింపు లేని పరిస్థితుల్లో దేశంలోని అనేక రాష్ట్రాల్లో హక్కుల కోసం,సేద్యపు భూమి కోసం కౌలు రైతులు, గ్రామీణ పేదలు ఆందోళనా పోరాటాలు చేశారు. ఈ పోరాటాలు కొన్ని ప్రాంతాల్లో మిలిటెంట్ రూపం తీసుకున్నాయి. వాటిల్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అతి ముఖ్యమైనది. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం కౌలుదారీ సంస్కరణలు, భూసంస్కరణలు చేపట్టక తప్పలేదు. కేంద్ర ప్రభుత్వ కౌలుదారీ సంస్కరణల్లో భాగంగా 1950లో తెలంగాణ కౌలుదారీ చట్టం చేయబడింది. ఈ చట్టానికి ముందు వరుసగా ఆరు సంవత్సరాలు కౌలుదారులుగా ఉన్న వారిని రక్షిత కౌలుదారులుగా గుర్తించి వారికి భూమిపై హక్కులు కల్పించారు. సేద్యపు అవసరాల కోసం భూమిని తనకా పెట్టే హక్కు కూడా చట్టం కల్పించింది. నిబంధనల ప్రకారం కౌలు చెల్లించినంత కాలం కౌలుదారుగా కొనసాగుతాడు. కౌలు దారుకి కల్పించిన హక్కులతోపాటు భూయజమాని సొంత సేద్యం చేసుకునే హక్కు చట్టం కల్పించబడింది. దీన్ని ఉపయోగించుకుని భూకామందులు సొంత సేద్యం పేరుతో భూమి నుంచి కౌలుదారులను తొలగించారు. చివరికి కౌలు విధానం రాత పూర్వకం నుండి నోటి మాటకు మారింది. కౌలు రైతులకు ఎటువంటి హక్కులు లేకుండా పోయాయి. ఆచరణలో కౌలుదారీ చట్టం నిరుపయోగంగా మారింది. 1956లో రాష్ట్రాల పునర్వ్యస్థీకరణ చట్టం వచ్చింది. దేశంలోని రాష్ట్రాల సరిహద్దులు మారాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఒకే రాష్ట్రంగా ఏర్పడింది. 1956 లో ఆంధ్రప్రదేశ్ కౌలుదారీ చట్టం ఆనాటి ప్రభుత్వం చేసింది. ఇది ఆంధ్రా ప్రాంతానికే పరిమితం. తెలంగాణలో 1950 కౌలుదారీ చట్టమే అమల్లో ఉంది. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ ప్రభుత్వం 2011లో తెచ్చిన కౌలుదారీ చట్టంలో లైసెన్స్ పొందిన కౌలు రైతులకు సంవత్సర ప్రాతిపదికన అర్హత కార్డులు ఇస్తామని ప్రభుత్వం పేర్కొంది. తెలంగాణలో అప్పటికి ఉన్న 17.4 లక్షల కౌలు రైతుల్లో 6.8 లక్షల మంది అర్హత కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా 2011- 12లో 5.1 లక్షల మందికి మాత్రమే కార్డులు ఇచ్చారు. 2012-13లో 4.1 లక్షల మంది కౌలుదారులకే కార్డులు పరిమితమయ్యాయి. ఈ కార్డులు కూడా బ్యాంకుల నుంచి కౌలు రైతులకు పంట రుణాలు అందించలేక పోయాయి. అందుకు కారణం రైతుల అనుమతి పత్రం లేకపోవటమే. ఈ చట్టం కూడా కౌలు రైతులను మభ్యపెట్టి వారి సమస్యలను పక్కదారి పట్టించేందుకు తెచ్చిందే. 2014లో ముఖ్యమంత్రిగా బాధ్యత చేపట్టిన కెసిఆర్ అసలు కౌలు రైతులనే గుర్తించలేదు. ఇది ఫ్యూడల్ అహంకారంనుంచి వచ్చిందే. రేవంతరెడ్డి ముఖ్యమంత్రిగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కౌలు రైతుల పరిష్కార విధానాలు చేపట్టలేదు. తెలంగాణలో 2021 - 22లో వ్యవసాయ గణాంకాల లెక్కల ప్రకారం 63.12 లక్షల హెక్టార్ల భూవిస్తీర్ణంలో మొత్తం కమతాల సంఖ్య 64 లక్షలు. అందులో దాదాపు 22 లక్షల కమతాలు కౌలు రైతులవే. వారి సాగు చేస్తున్న భూమి 42% గా ఉంది. ప్రతి ముగ్గురు రైతుల్లో ఒకరు కౌలురైతే. 91% కౌలు చెల్లింపు నగదు రూపంలో ఉండగా, 7.5 శాతం పంట రూపంలో చెల్లిస్తున్నారని, 38.3% ఒప్పంద సమయంలోనే పూర్తిగా కౌలు చెల్లిస్తుంటే, 20.5% సగం కౌలు ముందు సగం తర్వాత చెల్లిస్తున్నారని, 41% కౌలు పంట కోతల తర్వాత చెల్లిస్తున్నారని రైతు స్వరాజ్ వేదిక స్టడీ తెలియచేస్తున్నది. రాష్ట్రంలో కౌలు రైతుల సంఖ్య, కౌలు భూమి విస్తీర్ణం నిరంతరం పెరుగుతూ ఉంది. అత్యధిక మంది కౌలుదారులు ముందుగానే కౌలు డబ్బులు చెల్లించి భూమి సాగు చేస్తున్నారు. పంట నష్టపోయిన సందర్భంలో ఎటువంటి సహాయం అందక అప్పుల్లో కూరుకుపోతున్నారు. భూమిని కౌలుకు ఇవ్వటం ప్రోత్సహించాలని ప్రపంచ బ్యాంక్ చెప్పినందుకు భారతదేశ రాష్ట్ర ప్రభుత్వాలు, భూసంస్కరణలు అమలు జరపకుండా భూమిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే వ్యవసాయ విధానాలు రూపొందిస్తున్నారు. దీన్ని సమర్ధించుకోవటానికి చిన్న కమతాల వ్యవసాయం లాభదాయకం కాదని, ఉత్పాదక పెరగదనే ప్రచారం ప్రారంభించారు. వాస్తవంగా చిన్న కమతాల వల్లే ఎక్కువ దిగుబడులు వస్తున్నాయని అనేక సర్వేలు వెల్లడించాయి. మోడీ ప్రభుత్వ సూచనల మేరకు నీతిఆయోగ్ భూమిలేని పేదల వ్యవసాయ సామర్ధ్యం మెరుగు పరచటం కోసమంటూ 2016లో వ్యవసాయ భూమి కౌలుపై నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. దేశంలోని వివిధ రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోగల వ్యవసాయ భూమి లీజింగ్‌పై నమూనా చట్టం రూపొందించింది. ఈ నమూన చట్టంలో ప్రభుత్వ అందించే అన్ని రకాల సహాయాలకు కౌలురైతులు అర్హులు అయ్యే విధంగా చట్టం రూపొందించినట్లు చెప్పింది. యజమానికి పూర్తి భద్రత కల్పిస్తూ, కౌలు రైతుకు భూమిపై ఎటువంటి హక్కు ఉండదని, దీర్ఘకాలికంగా భూమిని కౌలుకు తీసుకున్న వారసత్వంగా భూమిని పొందలేడని, ఎలాంటి సమయంలోనైనా కౌలుదారుని ముందుగా హెచ్చరించి కౌలు రద్దు చేసుకోవచ్చని నమూన చట్టంలో పేర్కొన్నారు. భూపంపిణీ గురించి చట్టంలో ప్రస్తావనే లేదు. గత కౌలుదారీ చట్టాల్లోనూ, నీతిఆయోగ్ నమూనా చట్టంలో గాని కౌలురైతుకు ఎటువంటి హక్కులు లేవు. భూయజమాని ఇష్టాయిష్టాలపై భూమి కోసం కౌలు రైతు ఆధారపడి ఉండాలి. ఇలాంటి చట్టాలు కౌలు రైతుల సమస్యలు పరిష్కరించవు. మానవ మనుగడకు వ్యవసాయం ప్రధాన జీవనాధారం. అలాంటి వ్యవసాయంలో ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతాంగం పరిస్థితి ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. సేద్యపు ఖర్చులు ఎక్కువ కావటం, అందుకు అనుగుణంగా పంటలకు ధరలు లభించకపోవటం, సంస్థాగత రుణాలు అందక అధిక వడ్డీలకు అప్పులు చేయటం, ప్రభుత్వం ప్రకటించే పరిహారాలు అందకపోవటం వల్ల రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక్కో రైతు కుటుంబంపై 1,53,113 ఉండగా, కౌలు రైతు కుటుంబాలు మాత్రం సగటున 2.70 లక్షల రూపాయల అప్పుల్లో ఉన్నారు. ఇందులో రెండు లక్షలు ప్రైవేట్ వ్యక్తుల నుండి అధిక (24% నుండి 60% వరకు) వడ్డీలకు అప్పులు తీసుకున్నారు. రైతుల ఆత్మహత్యల్లో కూడా కౌలు రైతులు సంఖ్య ఎక్కువగానే ఉంది. పాలక ప్రభుత్వాలన్నీ భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను కాపాడుతూ పేద, కౌలు రైతుల వ్యతిరేక విధాలు అనుసరిస్తూ ఉన్నాయి. ప్రభుత్వాలు చేసిన కౌలు చట్టాలన్నీ అందుకు అనుగుణంగానే ఉన్నాయి. ఈ చట్టాలేవి కౌలు రైతుల సమస్యలు పరిష్కరించలేక పోయాయి.

# శనీశ్వర పూజతో అంతా శుభమే



"నీలాంజన సమాభాసం ! రవిపుత్రం యమాగ్రజం! ఛాయా మార్తాండ సంభూతం ! తం నమామి శనైశ్చరమ్" ! భారతీయుల జ్యోతిష శాస్త్రం ప్రకారం 'శనీశ్వరుడు', నవగ్రహాలలో ఒక గ్రహం. సూర్యుడు, చంద్రుడు, ఛాయా గ్రహాలైన రాహువు మరియు కేతువులతో కలిపి గ్రహాలు తొమ్మిది. గగన మండలంలో ఉన్న గ్రహాలకు భూమితో సంబంధం ఉంది. కాబట్టి తొమ్మిది గ్రహాల ప్రభావం భూమి మీద, భూమిపై ఉన్న ప్రతి చరాచర జీవుల పైన, నిర్జీవ, ఝడ, నిర్లిప్త వస్తువుల మీద వుంటుంది. నవగ్రహాలలో ఒకటైన శని గ్రహం ఇందుకు బిన్నం కాదు. శని, శనిగ్రహం, శనేశ్వరుడు, శనీశ్వరుడు, అని పలు నామములతో పిలువబడి, గ్రహ రూపంలో పూజింపబడే 'శని' ఒక గ్రహదేవుడు. వారంలో ఏడవవారం శనివారం. శనికి మంద గమనుడు అని కూడా పేరు. శనై: క్రమతీతి అనగా అతినెమ్మదిగా కదిలేవాడు అని అర్థం. ఒకసారి సూర్యుని చుట్టి రావడానికి శనికి 30 సంవత్సరాలు పడుతుంది. శానైస్కర్య, అసిత, సప్తర్చి, క్రూరదృష్ట, క్రూర లోచనుడు, పంగు పాదుడు, గృధ్ర వాహనుడు మొదలైన పేర్లుకూడా ఉన్నాయి. సంఖ్యలలో 'ఎనిమిది' శనికి ప్రీతికరమయిన సంఖ్య. ఛాయదేవికి పుట్టిన సంతానం శనిదేవుడు. ఆయనకు ఛాయాపుత్రుడు అనే పేరు కూడా ఉంది. జీవుల జాతక చక్రాలపైన తన ప్రభావాన్ని ఎలా చూప బోతున్నాడో అని నిరూపించడానికి ఆయన జననం సూర్య గ్రహణములో జరిగింది. దేవతల్లో శని దేవుడికి విశిష్టమైన స్థానముంది. జీవులు చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తం కల్పించి, శిక్షించి, ధర్మాన్ని నిలిపే శని భగవానుడు యమ ధర్మరాజుకు అన్న. యముడు మరణానంతరం దండనలు విధిస్తే, శనిదేవుడు వారి వారి కర్మ ఫలములను బట్టి జీవులు బ్రతికి ఉండగానే హింసించి, యాతనలకు గురిచేసి శిక్షిస్తాడు. శనీశ్వరుడు గోచారస్థితి ఫలితంగా ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని, ప్రభావం పడితే అనేక ఇబ్బందులను కలిగిస్తాడు. హిందూ క్యాలెండర్ ప్రకారం వైశాఖ చతుర్దశి అనంతరం వచ్చే అమవాస్య రోజు శని జయంతి జరుపు కుంటారు. సూర్యదేవుని కుమారుడైన శని.. జ్యోతిష శాస్త్రం ప్రకారం మానవుల జీవితంపై తీవ్ర ప్రభావం చూపిస్తాడు. శనీశ్వరుడిని భక్తి శ్రద్ధలతో కొలిచి ఆయన అనుగ్రహం పొందితే కష్టాలు దూరమై.. అదృష్టం కలిసి వస్తుంది. దుష్టశక్తుల నుంచి మనల్ని మనం కాపాడు కోవడానికి శని దేవున్ని ప్రసన్నం చేసుకోవాలి. అంటే తైలాభిషేకం చేసి శాంతి పూజలు నిర్వహించాలి. బ్రహ్మ వైవర్త పురాణం ప్రకారం, పార్వతీ దేవి, నలుగు పిండి బొమ్మకు ప్రాణం పోసినప్పుడు, వినాయకుడు జన్మించాడు. సకల దేవతలు, నవగ్రహాలు ఆ బాల వినాయకుడిని చూడటానికి వచ్చారు. ఆ ముగ్ధ మోహన బాలుడిని అక్కడకు విచ్చేసిన దేవతలు, మునులు కనులార చూసి, దీవెనలు అందించి, పార్వతీ దేవికి మోదం కలిగించారు. శని భగవానుడు మాత్రం తల ఎత్తి ఆ బాలుని చూడలేదు. అందుకు పార్వతీదేవి కినుక వహించి, తన బిడ్డను చూడమని శనిని ఆదేశించింది. అయినా శని తన దృష్టి, ఆ బాల గణపతి పై సారించలేదు. తన దృష్టి పడితే ఎవరికైనా కష్టాలు తప్పవని ఎంత నచ్చచెప్పినా, మాతృ గర్వంతో శనీశ్వరుడి సదుద్దేశం తెలుసుకో లేక, పార్వతీ దేవి తన కుమారుని చూడమని పదే పదే శనిని ఆదేశించింది. శని తల ఎత్తి చూసిన కారణంగా బాల గణపతి మానవ రూపంలో ఉండే తలను కోల్పోయినాడని బ్రహ్మ వైవర్త తదితరాలు తెలుపు తున్నాయి. శని భగవానుని జన్మ వృత్తాంతం విన్న విక్రమాదిత్యుడు ఆయనను పరిహాసమాడాడట! ఆ పరిహాసాన్ని విన్న శని కోపగ్రస్తుడై విక్రమాదిత్యుని శపించాడట. శనిని కించపరిచే విధంగా మాటలాడి, అవమానించి నందుకు ఫలితంగా విక్రమాదిత్యుడు అనేక కష్టాలు అనుభవించాడు. రాజ్యాన్ని పోగొట్టు కున్నాడు, చేయని దొంగతనపు నింద మోపబడి, పొరుగు రాజుచే కాళ్ళు, చేతులు నరికివేయ బడ్డాడు. చివరికి, విసిగి వేసారి పోయి, బాధలు ఏమాత్రం భరించే ఓపికలేక, నిర్వీర్యుడై, భ్రష్టుడై, చేసేదిలేక, తనను కనికరింపమని శనిదేవుని అత్యంత శ్రద్ధతో, ఆర్తితో, భక్తితో ప్రార్థించగా, విక్రమాదిత్యుని భక్తికి సంతృప్తి చెందిన శనీశ్వరుడు తిరిగి అతని పూర్వ వైభవం ప్రాప్తింప చేసాడు. శని దశ దుష్ప్రభావాలతో బాధపడే వారు, భక్తితో శని దేవునికి నూనె సమర్పిస్తే చెడు ఫలితాలు పోతాయని విశ్వాసం. శని దేవతను ప్రతిబింబించే నల్ల వస్తువులను... నల్ల ధాన్యాలు, నల్ల మినప్పప్పు, నల్ల నూనెలు, నల్ల ఆవులు, నల్ల బట్టలు, మొదలైనవి దానం చేస్తే చెడు ప్రభావాలు తొలగిపోతాయి. చీమలకు బెల్లాన్ని ఆహారంగా ఇస్తే శని సంతుష్టుడై ఉంటాడు. శని స్తోత్రాన్ని నిత్యం పఠిస్తే భగవంతుడి ఆశీర్వాదాలు పొందుతారు. జీవితంలో క్లిష్టమైన పరిస్థితులు ఎదుర్కొంటోన్న సమయంలో సూర్య దేవుడి కుమారుడైన, శని దేవుడికి పూజ చేస్తే మంచి ఫలితాలుంటాయి. శనివారం ఉపవాసం ఉండి, శనీశ్వరుడి అనుగ్రహం పొందితే అదృష్టం కలిసి వస్తుంది. శని మనిషి చేసిన చెడు కర్మ ఫలితాన్ని తొలగిస్తాడు. జాతక రీత్యా శని పన్నెండవ ఇంట, ఒకటవ ఇంట, రెండవ ఇంట సంచరిస్తున్నప్పుడు, దానిని "ఏలినాటి శని" లేదా "సాడే సాతి" అంటారు. అయితే ఈ సమయంలో శని ఇచ్చే ఫలితం తాత్కాలికంగా చెడు అనిపించినా, అది ఆ వ్యక్తి భవిష్యత్తుకు ఎంతో సహాయ కారిగా ఉంటుంది. పూర్వ జన్మలో చేసిన పాపాల ప్రయత్నాన్ని కష్టాల రూపంలో శని ఈ సమయంలో తొలగిస్తాడు. తద్వారా ఆ వ్యక్తి కి మంచి భవిష్యత్తు కలుగుతుంది. మనం ఎంత కష్టం చేస్తే శని అంతా సంతృప్తి చెందుతాడు. కాబట్టి జాతకంలో కానీ, గోచారంలో కానీ, శని అనుకూలంగా లేని వ్యక్తులు శారీరకంగా కష్ట పడటం, అంటే ఇతరులకు సహాయం చేయడం మొదలైనవి చేస్తే ఆ చెడు ఫలితం తగ్గిపోయి శుభ ఫలితాలను శని ఇస్తాడు.

# నవయుగ వైతాళికుడు వీరేశలింగం



తెలుగులో తొలి నవల రచనకు నాంది పలికిన గొప్ప కవి ఆయన. మొదటి స్వీయ చరిత్ర రాసిన మహోన్నత వ్యక్తి ఆయనే. తెలుగులో తొలి ప్రహసనం వ్రాసింది కూడా ఆయనే. మొట్ట మొదటి వితంతు వివాహం జరిపించిన గొప్పతనం ఆయనదే. ఆయనే నవయుగ వైతాళికుడిగా ప్రఖ్యాత గాంచిన కందుకూరి వీరేశలింగం పంతులు.బాల్యవివాహాల రద్దుకోసం ఉద్యమించిన మహోన్నతుడు, గొప్ప సంఘ సంస్కర్త. మూఢ నమ్మకాలపై యుద్ధం ప్రకటించిన బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16 రాజ మండ్రిలో జన్మించారు. బ్రిటిష్ హయాంలో బాల్య వివాహాల ను నిరసిస్తూ ఆయన పెద్ద ఎత్తున ఉద్యమమే నిర్వహించారు. దీంతోపాటు అనేక సంఘ సంస్కరణలకు పాటు పడ్డారు. సామాజిక దురాచారాల నిర్మూలన కోసం నిరుప మానంగా కృషి చేశారు. ఆధునికాంధ్ర సమాజ పితామహుడిగా కీర్తి గడించిన కందుకూరి, బాల్య వివాహాలు రద్దు కోసం ఉద్యమిస్తూనే .. వితంతు వివాహలు జరిపించాలని కోరేవారు. దేశంలో మొదటి వితంతు వివాహం జరిపింది ఆయనే. సాహితీ వ్యాసంగంలోనూ విశేషంగా కృషిచేశారు కందుకూరి వీరేశలింగం పంతులు. బహుముఖ ప్రజాశాలి అయిన కందుకూరి. మొట్టమొదటి సహవిద్యా పాఠశాలను కూడా ప్రారంభించారు. తెలుగులో తొలి నవల వ్రాసింది. మొదటి స్వీయ చరిత్ర రాసింది కూడా ఆయనే. అంతేగాక తొలి ప్రహసనం కూడా కందుకూరి చేతినుంచి జాలువారింది. కందుకూరి జయంతిని నాటకరంగ దినోత్సవంగా జరుపుకుంటారు. జాతికి నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త, మన తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి . సంఘ సంస్కరణకు, సామాజిక దురాచారాల నిర్మూలనకు, తెలుగు సాహితీ వ్యాసంగంలోనూ నిరుపమానమైన కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. యుగకర్త గా, హేతువాదిగా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. ఒక వ్యక్తిగా, సంఘసంస్కర్తగా, రచయితగా అనేక విషయాల లో ఆంధ్రులకు ఆయన ఆద్యుడు, ఆరాధ్యుడు. తెలుగు కవుల జీవిత చరిత్ర రాసిన మొదటి వ్యక్తి. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు రచయిత. ఆంధ్ర దేశంలో బ్రహ్మ సమాజం స్థాపకులు. యువజన సంఘాల స్థాపన కూడా ఆయనతోనే మొదలయింది. సమాజ సేవ కొరకు హితకారిణి అనే ధర్మ సంస్థను స్థాపించి, తన యావదాస్తిని దానికి ఇచ్చేశారు. 25 సంవత్సరాల పాటు రాజమండ్రిలో తెలుగు పండితుడిగా పనిచేసి, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితుడిగా ఐదేళ్ళు పని చేసారు. తాము నమ్మిన సత్యాన్ని, సిద్ధాంతాన్ని తు.చ. తప్పకుండా పాటించిన ఆదర్శ వ్యక్తి. యుగకర్త గా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. ఆంధ్ర సమాజాన్ని సంస్కరణాల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం. ఆయన చేసిన ఇతర సంస్కరణా కార్యక్రమాలొక ఎత్తు, వితంతు పునర్వివాహాలొక ఎత్తు. అప్పటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేవారు. కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి, వితంతువులై, అనేక కష్టనష్టాలు ఎదుర్కొనే వారు. దీనిని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాలు జరిపించాలని విస్తృత ప్రచారం చేసారు.వీరేశలింగం హేతువాది. ఆయన జీవితం సంఘసంస్కరణ, సాహిత్య కృషి రెండింటితో పెనవేసు కు పోయింది. ప్రభుత్వంలోని అవినీతిని ఏవగించుకుని ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాన్ని, అబద్ధాలు ఆడక తప్పదని న్యాయవాద వృత్తిని వదులుకున్న వ్యక్తి అటువంటి దురాచా రాలపై ధ్వజమెత్తి, తన సంస్కరణాభిలాషను నిరూపించు కున్నారు. ఉన్నత విద్యానంతరం వీరేశలింగం అధ్యాపక వృత్తిని చేపట్టారు. రాజమండ్రి, కోరంగి, ధవళేశ్వరం, మద్రాసులలోని పాఠశాలల్లో పని చేశారు. అధ్యా పకుడిగా పనిచేస్తుండడంతో 'పంతులు'గారని, వీరేశలింగం పంతులుగా రని ప్రాచుర్యం పొందారు. సామాజిక రుగ్మతలను రూపుమాప డానికి 1876లో ఉపాధ్యావృత్తి నుండి జర్నలిస్టుగా మారి 'వివేకవర్ధిని' అనే మాసపత్రికను ప్రారంభించారు. మొదట ఈ పత్రిక మద్రాసు నుండి వచ్చేది. తర్వాత కొంతమంది స్నేహితులతో కలిసి, రాజమండ్రి లోనే సొంత ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచి పత్రికను నిర్వహించారు.ఆ రోజుల్లోనే లంచగొండితనం, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు%ౌ% ఇలా ఎన్నో అన్యాయాలు సమాజంలో జరుగుతుండేవి. వాటిపైకి తన పత్రిక 'వివేకవర్థిని'ని ఆయన ఎక్కుపెట్టారు. ఉపన్యాసాలకే పరిమితం కాకుండా ప్రత్యక్షంగా, ఆచరణాత్మకంగా సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. తొలి వితంతు పునర్వివాహాన్ని 11 డిసెంబర్ 1881న తన ఇంట్లోనే జరిపించారు. నవల, వ్యాసం, ఉపన్యాసం, విమర్శ వంటి ప్రక్రియలకు ఆద్యులు. తెలుగులో వచ్చిన తొలి సాంఘిక నవల 'రాజశేఖర చరిత్ర' (1878) పంతులు గారు రాసిందే. సంఘసేవలో వీరేశలింగం ఎంత కృషి చేసారో, సాహిత్యం లోనూ అంతే కృషి జరిపారు. చదువుకునే రోజుల్లోనే రెండు శతకాలు రాసాడు. పత్రికలకు వ్యాసాలు రాస్తూ ఉండేవారు. వివేకవర్ధనిలో సులభశైలిలో రచనలు చేసేవారు. వ్యావహారిక భాషలో రచనలు చేసిన ప్రథమ రచయితలలో ఆయన ఒకరు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లో అద్వితీయ ప్రతిభ కలవారు కందుకూరి. ఆయన 130కి పైగా గ్రంథాలు రాసాడు. అన్ని గ్రంథాలు రాసిన వారు తెలుగులో అరుదు. సాంఘిక దురాచారాలను సంభాషణాత్మకంగా, వినోదాత్మకంగా విమర్శించే ప్రహసనాల వంటి ప్రయోగానికి వీరేశలింగమే ఆద్యుడు.ఆంధ్ర సమాజాన్ని సంస్కరణల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం 1919 మే 27 న మరణించారు. వీరేశలింగం గొప్ప సంస్కర్తే కాదు, గొప్ప కవి, రచయిత. తెలుగు సాహిత్యంలో ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు. ఆయన రచనలు, కవిత్వాల్లో కూడా అభ్యుదయ భావాలు నిండి ఉండేవి. తెలుగు సాహిత్యంలో ఆయనకు సమున్నతమైన స్థానం ఉంది. నవలలు, కథలు, వ్యాసాలు అన్ని రకాల సాహితీ ప్రక్రియల్లో వీరేశలింగం గారు తన దైన ముద్ర వేశారు. తెలుగు సాహిత్యం ఉన్నంత వరకూ వీరేశలింగం ఉంటారు. సంస్కర ణోద్యమం ఉన్నంత వరకూ ఆయన పేరు చిరస్థాయిలో నిలుస్తుంది. ఆయన వ్యక్తి కాదు,గొప్ప వ్యవస్థ అనేది నూటికి నూరుపాళ్లు నిజం.

# అటవీ అధికారులపై అట్రాసిటీ కేసు నమోదుకు కలెక్టర్ ఆదేశం





**రైతులపై అక్రమ కేసుల నమోదుకు నిరసనగా ధర్నా..**
**పోలీస్ అధికారులకు వెంటనే ఫోన్లో ఆదేశం..**
**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి**

**బెల్లంపల్లి,మే26(సూర్యరేఖ)** వేమనపల్లి మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన దళిత రైతులపై అటవీశాఖ అధికారులు అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపడాన్ని తీవ్రంగా పరిగణించిన మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అటవీశాఖ అధికారులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి జైలుకు పంపాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. న్యాయవాది, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రైతులతో కలిసి ధర్నా చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు రైతులకు జరిగిన అన్యాయం గురించి ఫిర్యాదు చేశారు.గత యాభై సంవత్సరాల నుండి రైతులు చామనపల్లి శివారులోనీ సర్వే నెంబర్ 65,67లో సాగు చేస్తున్నారని అన్నారు.ఆ భూముల్లో విద్యుత్ మోటార్లు,స్తంభాలు,బోర్లు వేసుకొని వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు.ప్రభుత్వం పట్టా పాసు పుస్తకాలు ఇచ్చిందని,లోన్లు,రుణమాఫీ చేసిందని అన్నారు.1997లోనే ఫైనల్ పట్టా ఇచ్చిందని తెలిపారు.గత సంవత్సరం నుండి అటవీశాఖ అధికారులు ఈ భూములు అటవీశాఖకు చెందిన వని రైతులపై దాడులు చేస్తూ,అక్రమంగా కేసులు నమోదు చేసి రైతులను జైలుకు పంపించారని తెలిపారు.అటవీశాఖ అధికారులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే జైపూర్ ఏసీపికి,నీల్వాయి ఎస్ఐకి ఫోన్ చేసి అటవీ శాఖ అధికారులపై కేసు నమోదు చేసి జైలుకు పంపాలని ఆదేశించారు.బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి ఆధ్వర్యంలో నీల్వాయి పోలీస్ స్టేషన్ లో రైతులు ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు మున్నరాజ సిసోడియా,బిజెపి జిల్లా నాయకులు దుర్గం ఎల్లయ్య,రైతులు బానయ్యా లింగయ్య, పర్వతాలు,మధుకర్,బాధిత రైతులు పాల్గొన్నారు.

# గ్రామాలలో దైవచింతతో భక్తి పార్వశం పెంపొందుతుంది






**బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి**

**నిజాంపేట,మే26(సూర్యరేఖ)** గ్రామాలలో దైవచింతతో భక్తి పార్వశం పెంపొతుందని బీఆర్ఎస్ పార్టీ మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు.ఈ మేరకు నిజాంపేట మండల పరిధిలోని వెంకటాపూర్ (కె)గ్రామంలో బీరప్ప కురుమ సంఘం కులస్తుల ఆధ్వర్యంలో బీరప్ప కామరాతిదేవి,ల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కంఠారెడ్డి తిరుపతిరెడ్డి,హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్ల కురుమ సోదరులు ఐక్యతతో ఆలయాన్ని నిర్మించుకోవడం గొప్ప విషయం అన్నారు. గ్రామాలలో పండుగల ద్వారా కొత్త శోభ సంతరించుకుంటుందని ప్రజలకు భక్తి మార్గంలో వెళ్లేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రతిరోజు స్వామివారికి ధూప దీపనైవేద్యాలు సమర్పించాలని ఆ స్వామివారి అనుగ్రహంతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నామని తెలిపారు.బీరప్ప ఆలయానికి రూ.25 వేల విరాళాన్ని అందించారు.అలాగే నార్లపూర్ మాజీ సర్పంచ్ గోపరి నర్సింలు రూ.5016 అందించారు. బీరప్ప కురుమ సంఘ సభ్యులు వారిని శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్ గౌడ్ దయాకర్,మావురంరాజు,నాగరాజు మాజీ సర్పంచులు సంగుస్వామి గోపరి నర్సింలు నారా గౌడ్, మాజీ ఎంపీటీసీలు బాల్ రెడ్డి,చింతల స్వామి వెంకటస్వామి,ఆకుల మహేష్,రాములు గౌడ్ రెడ్డిశెట్టి రవీందర్ నాయిని లక్ష్మణ్ నగేష్,ఎల్లం యాదవ్,మహేష్,దుర్గయ్య, బైండ్ల నందు మైపాల్ సిద్ధ రాములు,గొల్ల కురుమస్తులు ఇరోళ్ల మల్లయ్య,బొమ్మ ఎల్లం చిగులనర్సింలు మల్లేష్, మహేష్ మధు రవి తదితరులు పాల్గొన్నారు.

# మోడీ క్యాంటీన్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ






**బెల్లంపల్లి,మే26 (సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణ స్థానిక న్యాయవాది నల్లుల సంగీత పట్టణంలోని కాంటా చౌరస్తాలో అంబలి పంపిణీ చేశారు.అనంతరం ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ...మోడీ ప్రభుత్వం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని,అందుకే దేశ రక్షణే తన ఎజెండగా స్వార్థం లేకుండా నిస్వార్థంగా పనిచేసే ఒకే ఒక్క నాయకుడు,ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. భారతదేశంలో స్వార్థం లేకుండా అందర్నీ కలుపుకొని పనిచేసే ఒకే ఒక పార్టీ భారత జనతా పార్టీ అని,ప్రజలకు సేవ చేయటానికే ముందుండే పార్టీ బిజెపి అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి గోమాస కమల, ఉపాధ్యక్షురాలు స్రవంతి రాజేష్,బూత్ అధ్యక్షులు ఉపేందర్,బీజేపీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్య ధోరణిని వీడాలి..

**ఎంసిపిఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్**



**బెల్లంపల్లి,మే26(సూర్యరేఖ)** బెల్లంపల్లి మున్సిపల్ అధికారుల తీరుపై ఏంసిపిఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ...బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మ్యూటేషన్ పేరుతో మున్సిపల్ అధికారులు ఇంటి నంబరు 7-2-12 గల మీద ఉన్న పేరును మార్చారు.తప్ప అదే ఇంటి మీద పంపు బిల్లుకు కూడా ఉంది.పంపు బిల్లులో పేరు మాత్రం పాత పేరే వస్తుంది.ఒకసారి ఆన్లైన్లో చేంజ్ అయినాక ఆ ఇంటి నెంబర్ మీద ఏమేమి ఉన్నాయని తెలుసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారుల పైన ఉంటుంది.కానీ ఇక్కడ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.మున్సిపల్ అధికారులు ఎప్పుడు చూసినా కూడా బిజీగానే ఉన్నామని చెప్తారు.ఇట్లాంటి విషయాలలో ఎందుకు చొరవ తీసుకోవట్లేదని మేం ప్రశ్నిస్తున్నామన్నారు. ఎంతోమంది చదువు రాని వారు ఉన్నారు.వారికి ఇదే పరిస్థితి కొనసాగితే ఎలా ఉంటుందని వారు వాపోయారు.ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్య ధోరణిని వీడి ఇలాంటి సంఘటనలు పునర్వతం కాకుండా చూడాలని ఎంసిపిఐ యూ పార్టీ డిమాండ్ చేశారు.

## రాంపూర్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్..



**నిజాంపేట,మే26(సూర్యరేఖ)**మండల పరిధిలోని రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోమవారం పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు పాఠశాల కెరీర్ గైడెన్స్ కౌన్సిలర్ అర్జున్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ కు సంబంధించిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది.కార్పొరేట్ కాలేజీ లో బాసర ఐఐఐటి నోటిఫికేషన్ రాగానే రెసిడెన్షియల్ అవసరమైన విద్యార్థులు ఆయా కాలేజీలలో అప్లై చేసుకొని తప్పకుండా ఇంటర్మీడియట్ విద్య పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మారెడ్డి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో జీలుగు విత్తనాలు..

**మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి**



**నిజాంపేట,మే26(సూర్యరేఖ)** రైతులకు అందుబాటులో 200 క్వింటాల జీలుగు విత్తనాలు ఉన్నాయని నిజాంపేట మండల వ్యవసాయ అధికారి సోమలింగరెడ్డి అన్నారు.ఈ మేరకు ఆగ్రోస్ రైతు కేంద్రంలో సోమవారం రైతులకు జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు.జీలుగు విత్తనాల కోసం రైతులు తమ పట్టా పాసుబుక్,ఆధార్ కార్డు తీసుకుని రైతు వేదికలో మండల విస్తీర్ణ అధికారులవద్ద రైతులు పేరు నమోదు చేసుకున్నట్లయితే టోకెన్ల ద్వారా రైతులకు జీలుగు విత్తనాలను అందిస్తామన్నారు.30 కేజీల జీలుగు ధర 2137.50 కేటాయించడం జరిగిందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు లక్ష్మీనారాయణ,కనకరాజు,నర్సింలు,రంజిత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి

**సిద్దిపేట :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం ఫిర్యాదుదారుల నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్ తో కలిసి జిల్లా కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు అర్జిదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో భూ సంబంధిత, హౌసింగ్, ఆసరా పింఛన్ల మరియు ఇతర అర్జిలు మొత్తం 73 వచ్చాయి. అర్జిదారులకు న్యాయం చేసి తిరిగి అర్జి పెట్టుకోకుండా పని చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఇట్టి కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మణికొండలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



**మణికొండ,మే26(సూర్యరేఖ)** మణికొండ మున్సిపాలిటీలో విచ్చలవిడిగా వెలుస్తున్న అక్రమ కట్టడాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం కొరడా ఝళిపించారు.టౌన్ ప్లానింగ్ సెక్షన్ నుండి ఎలాంటి అనుమతులు లేకుండా సెట్ బ్యాక్ లు కూడా లేకుండా 5,6 అంతస్తులు కడుతున్న బిల్డర్లకు గతంలోనే హెచ్చరికలు జారీ చేసినా.. నిర్మాణాలు ఆపక పోవడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు చేపట్టారు.గత కొన్నాళ్లుగా మణికొండ మునిసిపాలిటీ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్,పంచవటి కాలనీ,గోగ్రీన్ కాలనీ వెంకటేశ్వర కాలనీ,నెక్నాంపూర్ పుప్పాలగూడ తదితర ప్రాంతాలలో నిబంధనలను అతిక్రమించి పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారు.కాగా ఇటీవల స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి సంతోశ్ సింగ్ నేతృత్వంలో గో గ్రీన్ కాలనీలో వెలసిన అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. సోమవారం పంచవటి కాలనీలోని రామారావు అనే బిల్డర్ కు చెందిన ఓ నిర్మాణం సెల్లారుతో కలిసి నాలుగు అంతస్తులకు అనుమతి పొంది.అదనంగా రెండు అంతస్తుల నిర్మాణం చేపట్టడంతో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు మున్సిపల్ సిబ్బందితో కలిసి కూల్చివేతలను చేపట్టారు.అనుమతి లేకుండా నిర్మించిన రెండో అంతస్తులోని స్లాబ్‌లను తొలగించి సదరు బిల్డర్‌పై పోలీసు కేసు నమోదు చేస్తామని టౌన్ ప్లానింగ్ అధికారి సంతోశ్ సింగ్ తెలిపారు.అక్రమ కట్టడాలపై ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. మున్సిపాలిటీలో పరిధిలో పలుచోట్ల నిబంధనలను అతిక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వారిని గుర్తించి ఇప్పటికే నోటీసులు అందజేయ డం జరిగిందని పేర్కొన్నారు.త్వరలోనే పోలీసు బందోబస్తుతో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని పలుచోట్ల అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు చెప్పారు.

## ఘనంగా తెలంగాణ గాన కోకిల బెల్లిలలిత 26వ వర్ధంతి వేడుకలు..



**రాజేంద్రనగర్,మే 26** తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన పాటలతో ప్రజలను చైతన్యం చేసి తన జీవితాన్ని స్వరాష్ట్ర సాధన కోసం అర్పించిన వీర వనిత తెలంగాణ గాన కోకిల బెల్లి లలిత అని రాజేంద్రనగర్ సామాజికవేత్త గుఱ్ఱంపల్లీ శామ్యూల్ రాజ్ అన్నారు. గాన కోకిల బెల్లి లలిత 26వ వర్ధంతిని పురస్కరించుకొని రాజేంద్రనగర్ చౌరస్తా డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గుఱ్ఱంపల్లీ శామ్యూల్ రాజ్ మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రం కోసం బరి గీసి కొట్లాడిన వీర వనిత బెల్లి లలితక్క అని,ఆమె ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు.తన పాటల ద్వారా తెలంగాణ ప్రజలలో వస్తున్న చైతన్యన్నీ తట్టుకోలేక కొన్ని దుష్టశక్తులు 17 ముక్కలుచేసి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు.స్పిన్నింగ్ మిల్లులో కార్మికురాలిగా పనిచేస్తూ కార్మికుల సమస్యల మీద త్రాగే నీటి కోసం గుట్కా నిషేధం చేయాలని,తన పాటలతో ప్రజలను చైతన్యం వంతం చేసిన పోరాట యోధురాలని కొనియాడారు.ఈ హత్య ఓర్వలేని అభివృద్ధి నిరోధక పాలకుల ప్రమేయం లేకుండానే జరిగిందా అని అనుమానం కలిగిస్తున్నదని మండిపడ్డారు.పేదలకు పేదల నుంచి మంచి చేసే వారిని అణగ దొక్కడం,అంత మొందించడం భూస్వామ్య పెట్టుబడిదారీ పాలకుల పాలనలో జరగడం శోచనీయమని అయన దుయ్యాబట్టారు.ప్రజలు పాలకుల కుట్రలను,దోపిడీని తెలుసుకొని ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో మంత్రి చంద్రశేఖర్,ఎం.మహేష్,ఎద్దు సుందర్ రావు,షాబాద్ రవి,మక్తల్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలిపురంలో అధ్వానంగా శ్మశాన వాటిక

**ఆఖరి మజిలీకి అవస్థలే..**
**శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలి..**
**మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు**
**ఎస్.వెంకటేష్ కురుమ**




**రాజేంద్రనగర్,మే26(సూర్యరేఖ)** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలిపురం స్మశానవాటిక,ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ డివిజన్ పార్టీ అధ్యక్షులు వెంకటేష్ కురుమ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.రవికుమార్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ...పద్మశాలిపురం కాలనీలో 30 వేల నిరుపేద ప్రజలు నివాసం ఉంటున్నారని తెలిపారు.ఆఖరి మజిలీలో ప్రశాంతంగా అంత్యక్రియలు నిర్వహించుకోలేకపోతున్నారని తెలిపారు.
అరాకోరా వసతులతో కాలాన్ని వెల్లదీస్తున్న ప్రజలు స్మశాన వాటికలోకి వచ్చేందుకు జంకుతున్నారని అన్నారు.స్మశాన వాటికలో ఉన్న స్నానపు గదులు అసాంఘిక శక్తులకు అడ్డగా మారాయన్నారు. మహిళలకు పురుషులకు వేర్వేరుగా స్నానపు గదులు,మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు.త్రాగు నీరు వసతి,ఖాళీ స్థలంలో ఆహ్లాదకరంగా ఉండేలా సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు.విద్యుత్ సౌకర్యం,స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే పద్మశాలిపురం కాలనీలో రోడ్లన్నీ పూర్తిగా డామేజ్ అయ్యాయని,వాటి స్థానంలో నూతన రోడ్లను వేయాలని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని,దీంతో విద్యార్థులు అంటువ్యాధుల భారినపడే అవకాశం ఉందని తెలిపారు.పాఠశాల పరిసరాలలో పారిశుద్ధ పనులు చేయించి విద్యార్థులను రోగాల బారి నుంచి రక్షించాలని కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.రవికుమార్ తెలిపారు.వినతి పత్రం అందజేసిన వారిలో రాముయాదవ్, రాఘవేందర్ యాదవ్,రాజేష్ యాదవ్,ఎడ్లకాడి సూర్యం,అశోక్ కుమార్, జనార్దన్,తదితరులు ఉన్నారు.

## శంకర్‌పల్లి 13వ వార్డులోని బీఫ్ షాపును తొలగించాలి..

**మున్సిపల్ కమిషనర్ యోగేష్ కు కాలనీవాసుల వినతి..**



**శంకర్‌పల్లి,మే26 (సూర్యరేఖ)** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులోని బీఫ్ షాపును తొలగించాలని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ యోగేష్ కు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కాలనీవాసులు విలేకరులతో మాట్లాడుతూ...కాలనీలో ఉన్న బీఫ్ షాప్ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కళేబారాల వ్యర్థాలను తీయకుండా అక్కడే వదిలి వేయడం వల్ల ప్రజలు దుర్వాసనను భరించలేక పోతున్నారని పేర్కొన్నారు.కళేబరాల ఎముకలను కుక్కలు ఎక్కడపడితే అక్కడ ఇండ్ల ముందు వేసి వెళ్ళిపోతున్నాయని తెలియజేశారు. వెంటనే కాలనీలోని ఇండ్ల మధ్య నుండి బీఫ్ షాపును వెంటనే తొలగించాలని,ప్రజలు మున్సిపల్ కమిషనర్ ను కోరారు.మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్టు కాలనీవాసులు తెలిపారు.

## గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి..

**బీజేవైఎం ఆధ్వర్యంలో ఎస్ఐకి వినతి పత్రం అందజేత..**




**నిజాంపేట,మే26(సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ యువమోర్చా జిల్లా కమిటీ పిలుపుమేరకు గోవుల అక్రమ రవాణా అరికట్టాలని గోవద నిషేధించాలని కోరుతూ సోమవారం నిజాంపేట మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఇంచార్జ్ ఎస్సై సృజన,కి బీజేవైఎం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ... హిందువుల ఆరాధ్య దైవమైన గోమాతను వదించవద్దని వధించే వారిని చట్టపరంగా శిక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నిజాంపేట బిజెపి యువమోర్చా నాయకులు గజం రాజు ప్రణయ్ కుమార్,రమేష్,సందీప్ గౌడ్,రాజిరెడ్డి,అనిల్ భరత్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించాలని బడిబాట కార్యక్రమం..




**నిజాంపేట,మే26(సూర్యరేఖ)** మండల కేంద్రంతో పాటు నందగోకుల్ గ్రామాలలో సోమవారం బడిబాట కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ...ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలో బడిబాట కార్యక్రమం చేపట్టామన్నారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు రెండు జతల యూనిఫామ్,ఉచిత మధ్యా హ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు.పదవ తరగతి ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. విద్యార్థుల తల్లిదం డ్రులు వారి పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి కోరారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపా ధ్యాయులు మహేందర్ గుడ్ల శ్రీకాంత్,పాఠశాల ఉపాధ్యాయులుశ్రీనివాస్ చారి దేవయ్య,సిఆర్ పిరాజు,జూనియర్ అసిస్టెంట్ ప్రణయ్ గణేష్ దశరథం,తదితరులు పాల్గొన్నారు.

## యువతను కుస్తీ పోటీలకు ప్రోత్సహించడం అభినందనీయం..

**ఉత్తరపల్లి దయానంద్.**




**మెహిదీపట్నం,మే 26(సూర్యరేఖ)** గుడిమల్కపూర్ దివిజన్ పరిధిలోని తాళ్ళగడ్డ కబ్బడి స్టేడియంలో శ్రీయువక్ గణేష్ మండప్ 2025 కుస్తీ పోటీల నిర్వహకులు వినోద్ సింగ్ పహిల్వాన్,అక్షయ్ సింగ్ పహిల్వాన్, కిషోర్ సింగ్ పహిల్వాన్,ల ఆద్వర్యంలో కుస్తీ పోటీలు ఘనంగా జరగాయి.ఈ కార్యక్రమానికీ అతిథులుగా భాజపా అనుబంద యువమోర్చ కార్వాన్ డివిజన్ నాయకులు ఉత్తర్ పల్లి దయానంద్ పద్మశాలి హాజరై 1వ టీం చాపియన్ విజేత దేవిసింగ్ పహిల్వాన్ కు కప్ అందజేశారు.ఈ సందర్భంగా పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క పహిల్వాన్,లకు అభినందనలు తెలిపారు.కుస్తీ పోటీల్లో యువతను ప్రోత్సహించిన పోటీ నిర్వహకులు వినోద్ సింగ్,అక్షయ్ సింగ్,కిషోర్ సింగ్ పహిల్వాన్,లకు దన్యవాదాలు తెలిపారు.

# పేదల సంక్షేమమే ప్రధాన ధ్యేయం





రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

**నార్సింగ్,మే26(సూర్యరేఖ)** రాష్ట్రంలో పేదల సంక్షేమమే ప్రధాన ధ్యేయమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి ఎంతో మేలు చేస్తుందని వివరించారు.నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలో మంజూరు అయిన 238 ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు ఆయన సోమవారం కోకాపేటలో మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల కష్ట సుఖాలు తెలిసినవారని,వారికి అవసరమైన అన్ని రకాల పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ఆయన అన్నారు.ప్రభుత్వ పథకాలను అందుకున్న వారు వాటిని సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని ఆయన సూచించారు.పేద ప్రజల ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఉచితంగా ఇవ్వడం చరిత్రలోనే మొదటి సారి అని,వాటిని ప్రతి ఒక్కరు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో అధికారులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని,వారికి సహకరించి అన్ని వార్డులను అభివృద్ధి చేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు.పనిచేస్తున్న అధికారులను తప్పు పట్టడం మంచి పద్ధతి కాదన్నారు.ఇందిరమ్మ గృహాలు రానివారు ఇంకా ఎవరైనా ఉంటే రాబోయే రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని వారందరికీ మంజూరు అయ్యేలా కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి,గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్,నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నార్సింగ్ మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్ యాదవ్ లతోపాటు మాజీ కౌన్సిలర్లు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దృఢత్వానికి తోడ్పడుతాయి

## జిఎం జి.దేవేందర్




**మందమర్రి,మే26(సూర్యరేఖ)** క్రీడలు మానసిక ఉల్లాసానికే కాకుండా శరీర దృఢత్వానికి కూడా తోడ్పడుతాయని,చదువుతో పాటు క్రీడలలో రాణించాలని ఏరియా జిఎం జి. దేవేందర్ అన్నారు.మందమర్రి ఏరియాలోని సిఈఆర్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ జి.దేవేందర్ హాజరై విద్యార్థిని విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. గత నెల రోజులపాటు నిర్వహించుకున్న డబ్ల్యూపిఎస్ అండ్ జిఎ వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వారి ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని మందమర్రి బెల్లంపల్లి, సోమగూడెం రామకృష్ణాపూర్ స్టేడియాలలో వాలీబాల్ అథ్లెటిక్స్ ఫుట్ బాల్ వంటి క్రీడలలో నిష్ణాతులైన కోచులను నియమించి ఉచిత శిక్షణ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్,ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ,అధికారుల సంఘం అధ్యక్షులు రమేష్,క్రీడల గౌరవ సెక్రెటరీ కార్తీక్,క్రీడల కోఆర్డినేటర్ శివ,క్రీడల జనరల్ కెప్టెన్ శ్రీనివాస్, మైదానం ఇన్చార్జ్ తిరుపతి,కోచ్ లు క్రీడాకారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి



జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి



**మెదక్,మే 26(సూర్యరేఖ)** ప్రజావాణి కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు.మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్,ల ఎస్ఐ,సిఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది.ప్రజలు నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి,పైరవీలు లేకుండా స్వచ్చందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ,వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరిస్తున్నామని తెలిపారు.పోలీసులు ప్రజలకు దగ్గరయ్యేలా,శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలియజేశారు.ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు

## పుష్కర స్నానం ఆచరించిన ఎమ్మెల్యే మదన్మోహన్.



**కామారెడ్డి,మే26(సూర్యరేఖ)** ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు త్రివేణి సంగమంలో పుష్కరస్నానం ఆచరించారు.కాలేశ్వర సరస్వతినది పుష్కర ఉత్సవాలలో భాగంగా సోమవారం భూపాలపల్లి జిల్లా కాలేశ్వరంలో జరుగుతున్న సరస్వతినది పుష్కర మహోత్సవాల్లో పాల్గొని పుష్కర స్నానం చేశారు.సోమవారం ఉదయం ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో 150 వాహనాల్లో కాన్వాయ్ గా వెళ్లారు.ఎమ్మెల్యేతో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకులు కలిసి త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించారు.శ్రీముక్తేశ్వర స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే మదన్మోహన్ మాట్లాడుతూ...పుష్కరాల సమయంలో పవిత్ర నదుల్లో స్నానం చేయడం ఆరుదైన అదృష్టమని, ఎల్లారెడ్డి ప్రజలు,రైతులు పాడి పంటలతో అష్ట ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు. ప్రజలందరూ శాంతిగా భక్తిశ్రద్ధలతో పుష్కర ఉత్సవాలను జరుపుకోవాలని ఆయన అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన మంత్రి శ్రీధర్ బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఎమ్మెల్యే,ఎంపి,లను విమర్శించే అర్హత లేదు..

పట్టణ కాంగ్రెస్ నాయకులు



**మందమర్రి,మే26(సూర్యరేఖ)** చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని, పార్లమెంట్ సభ్యుడు వంశీకృష్ణ,లను విమర్శించే అర్హత ఐఎన్టియూసి నాయకులు కాంపెల్లి సమ్మయ్యకు లేదని మందమర్రి కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు.సోమవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సొతుకు సుదర్శన్ తో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ...కాంపెల్లి సమ్మయ్య విమర్శించినట్లుగా చెన్నూరు.ఎమ్మెల్యే వివేక్, పార్లమెంటు సభ్యుడు వంశీకృష్ణ,లు ఎస్సీ వర్గీకరణకు ఎప్పుడు వ్యతిరేకంగా మాట్లాడ లేదని, మాలలకు రిజర్వేషన్లలో తగినంత ప్రాతినిధ్యం కల్పించాలని మాత్రమే తెలపడం జరిగిందని స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ఎమ్మెల్యే వెంట తిరుగుతూ వారికి వ్యతిరేకంగా మాట్లాడడం పత్రిక ప్రకటనలు ఇవ్వడం సమంజసం కాదని వారు అన్నారు.ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి,పార్లమెంట్ సభ్యులు వంశీకృష్ణ,లు దళితుల్లో చీలిక తెస్తున్నారనే ఆరోపణ అసత్యమని తెలిపారు. ఇకముందు ఎమ్మెల్యే,ఎంపీని విమర్శించడం మానుకోవాలని పేర్కొన్నారు.ఇలాంటివి మళ్లీ పునరావృతం అయితే ఊరుకునేది లేదని కాంగ్రెస్ నాయకులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన పెంతే కోస్తు మిషన్ బోధనలు..




**ఉప్పల్,మే26 (సూర్యరేఖ)** పెంతెకోస్తు మిషన్ చర్చి బైబిలు బోధనలు ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్ లో సోమవారం 26 నుండి గురువారం 28 సాయంత్రం 6 గంటల నుంచి 9 వరకు జరగనున్నాయి.”మంచి సమరయుడైన యేసుక్రీస్తును గురించి,కొత్త నిబంధన సంఘం అంశంపై ఆత్మీయ వర్తమానం పాస్టర్ లూకాస్ ప్రసంగించారు.కుల మతాలకు అతీతంగా ప్రజలందరూ అన్ని క్రైస్తవ డినామినేషన్,లు, ఇండిపెండెంట్ చర్చిల విశ్వాసులు పాస్టర్లు పాల్గొని బైబిలు బోధనలు వినిపియడం జరుగుతుందని ఇంచార్జ్ బ్రదర్ బ్రదర్ శ్యాంపాల్ తెలిపారు. అనంతరం బోజన సౌకర్యం ఉంటుందని తెలిపారు.

# అటవీ అధికారుల పై అట్రాసిటీ కేసు నమోదుకు కలెక్టర్ ఆదేశం





**రైతులపై అక్రమ కేసుల నమోదుకు నిరసనగా ధర్నా**
**పోలీస్ అధికారులకు వెంటనే ఫోన్లో ఆదేశం**
**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి**

**బెల్లంపల్లి,మే26(సూర్యరేఖ)** వేమనపల్లి మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన దళిత రైతులపై అటవీశాఖ అధికారులు అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపడాన్ని తీవ్రంగా పరిగణించిన మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అటవీశాఖ అధికారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి జైలుకు పంపాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు.న్యాయవాది,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రైతులతో కలిసి ధర్నా చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు రైతులకు జరిగిన అన్యాయం గురించి ఫిర్యాదు చేశారు.గత యాభై సంవత్సరాల నుండి రైతులు చామనపల్లి శివారు లోనీ సర్వే నెంబర్ 65,67 లో సాగు చేస్తున్నారని అన్నారు.ఆ భూముల్లో విద్యుత్ మోటార్లు,స్తంభాలు,బోర్లు వేసుకొని వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం పట్టా పాసు పుస్తకాలు ఇచ్చిందని లోన్లు,రుణమాఫీ చేసిందని అన్నారు. 1997లోనే ఫైనల్ పట్టా ఇచ్చిందని తెలిపారు. గత సంవత్సరం నుండి అటవీశాఖ అధికారులు ఈ భూములు అటవీ శాఖ కు చెందినవని రైతులపై దాడులు చేస్తూ,అక్రమంగా కేసులు నమోదు చేసి రైతులను జైలుకు పంపించారని తెలిపారు. అటవీశాఖ అధికారుల పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే జైపూర్ ఏసీపికి,నీల్వాయి ఎస్ఐకి ఫోన్ చేసి అటవీశాఖ అధికారులపై కేసు నమోదు చేసి జైలుకు పంపాలని ఆదేశించారు.బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి ఆధ్వర్యంలో నీల్వాయి పోలీస్ స్టేషన్ లో రైతులు ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు మున్నరాజ సిసోడియా,బిజెపి జిల్లా నాయకులు దుర్గం ఎల్లయ్య, రైతులు బానయ్యా లింగయ్య పర్వతాలు,మధుకర్,బాధిత రైతులు పాల్గొన్నారు.

# మునీర్ అన్నకు నివాళులు అర్పించిన బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు





**బెల్లంపల్లి,మే26(సూర్యరేఖ)** బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సదానందం ఆద్వర్యంలో నిర్వహణ కలం యోధుడు ఉద్యమనేత సీనియర్ పాత్రికేయులు దివంగత జర్నలిస్టు మునీర్ కు బెల్లంపల్లి పాత్రికేయుల నివాళులు అర్పించారు. సోమవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆయన చిత్ర,పటాన్ని ఏర్పాటు చేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా వారు బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షుడు సజ్జు షఫీ మాట్లాడుతూ..మునీర్ భాయ్ పత్రికా రంగానికి విశేష సేవలు అందించడంతోపాటు కార్మిక వర్గానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన అనారోగ్యంతో మృతి చెందడం పత్రికా రంగానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కారుకూరి సదానందం మాట్లాడుతూ..మలిదశ తెలంగాణ ఉద్యమంలో జేఏసీ కన్వీనర్గా బాధ్యతలు స్వీకరించి తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం వరకు మడమతిప్పని పోరాటాలు చేసిన మహనీయుడని పత్రికా రంగంలో సీనియర్ పాత్రికేయుడుగా రాణిస్తూ విశ్లేషణాత్మకమైన కథనాలతో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విశేష కృషిని చేయడం జరిగిందని,నాలుగు దశాబ్దాలకు పైగా వివిధ పత్రికల్లో బాధ్యతలు స్వీకరించి ప్రజా సమస్యలను పరిష్కరించడంలో తనదైన శైలిని ప్రదర్శించి ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచిన మునీర్ భాయ్ సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి మృతి చెందడం పత్రికా రంగానికి తీరని లోటని ప్రెస్ క్లబ్ కార్యవర్గం కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి కలగాలని మనసారా ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ టేకుల బస్తి,ఉపాధ్యక్షుడు ఇరుకుల్ల రమేష్, ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ పాండే, కోశాధికారి కత్తుల నవీన్ కార్యవర్గ సభ్యులు టి.శ్రావణ్ కె.రమేష్ కె.సాగర్ ఉపాధ్యక్షుడు దండబోయిన భాస్కర్,ప్రధాన కార్యదర్శి సుభాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# తలసేమియా చిన్నారుల కోసం దేశంలోనే అత్యధిక యూనిట్ల రక్తాన్ని సేకరించిన రికార్డు కామారెడ్డి జిల్లాకే దక్కింది

**రెండు సంవత్సరాల కాల వ్యవధిలోనే 3 వేల యూనిట్ల రక్తం సేకరణ..**
**రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవు.**

**కామారెడ్డి,మే26(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆదిత్య హాస్పిటల్ వారి సహకారంతో కామారెడ్డి రక్తదాతల సమూహం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఐవిఎఫ్ లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతం అయ్యిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు,లైన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద అధ్యక్షులు చిలువేరు మారుతి,కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్ లు తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ..దేశంలోనే తలసేమియా వ్యాధి చిన్నారుల కోసం రెండు సంవత్సరాల వ్యవధిలోనే అత్యధికంగా 3 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించిన ఘనత కామారెడ్డి రక్తదాతల సమూహనికే ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కి దక్కిందని అన్నారు.ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 250 మంది చిన్నారులు తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారని,వారికి జీవితాంతం 15 రోజులకు ఒకసారి ఒక యూనిట్ రక్తం అవసరం ఉంటుందని,వారి ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ఆ సమాజంలోని ప్రతి ఒక్కరి పైన ఉందని అన్నారు. నిస్వార్ధ సేవకులు రక్తదాతలని రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవని అన్నారు.రక్తదాన శిబిరానికి సహకరించిన చిలువేరి మారుతికి తలసేమియా సికిల్ సెల్ సొసైటీ పురస్కారాన్ని అందజేయడం జరిగింది. 73 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆర్కే విద్యాసంస్థల సీఈఓ జైపాల్



రెడ్డి,కామారెడ్డి రక్తదాతల సమూహ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుట్ల అనిల్ కుమార్ ఉపాధ్యక్షులు పర్శ వెంకటరమణ,ఎర్రం చంద్రశేఖర్ గంప ప్రసాద్,వేదప్రకాష్,ఉప్పల హరిధర్,కుంభాల లక్ష్మణ్ యాదవ్,నవీన్ లు పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్య ధోరణిని వీడాలి

**ఎంసిపిఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్**



**బెల్లంపల్లి,మే26(సూర్యరేఖ)** బెల్లంపల్లి మున్సిపల్ అధికారుల తీరుపై ఎంసిపిఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ..బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మ్యూటేషన్ పేరుతో మున్సిపల్ అధికారులు ఇంటి నంబరు 7-2-12 గల మీద ఉన్న పేరును మార్చారు తప్ప అదే ఇంటి మీద పంపు బిల్లుకు కూడా ఉంది పంపు బిల్లులో పేరు మాత్రం పాత పేరే వస్తుంది ఒకసారి ఆన్లైన్లో చేంజ్ అయినాక ఆ ఇంటి నెంబర్ మీద ఏమేమి ఉన్నాయని తెలుసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారుల పైన ఉంటుంది కానీ ఇక్కడ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.మున్సిపల్ అధికారులు ఎప్పుడు చూసినా కూడా బిజీగానే ఉన్నామని చెప్తారు.ఇట్లాంటి విషయాలలో ఎందుకు చొరవ తీసుకోవట్లేదు అని చెప్పి మేం ప్రశ్నిస్తున్నాం.ఎంతోమంది చదువు రాని వారు ఉన్నారు.వారికి ఇదే పరిస్థితి కొనసాగితే ఎట్లా ఉంటుందని తాము మున్సిపల్ అధికారులను అడుగుతున్నాం.ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్య ధోరణిని వీడి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఎంసిపిఐయూ పార్టీ డిమాండ్ చేస్తుందని తెలిపారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్,మే26(సూర్యరేఖ):** మల్లాపూర్ డివిజన్ పరిధిలో ఓల్డ్ మల్లాపూర్ బీసీ ఏరియాలో 51 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు రూ.12 లక్షల రూపాయలతో నాచారం,బాబానగర్ కాలనీలోని రజక స్మశానవాటికలో బర్నింగ్ ఫ్లాట్ ఫార్మ్,స్నానపు గదుల అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల అభివృద్ధి కోసం అవసరమైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజినీరింగ్ డిఈ.రూపా ఏఈ.శ్రవంతి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు సాయి జెన్ శేఖర్,ఓల్డ్ మల్లాపూర్ వాసులు,నాచారం రజక సంఘం సభ్యులు,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో,తిరంగా ర్యాలీ ప్రారంభించిన బిజెపి నాయకులు

### సైనికులకు వందనం తిరంగా ర్యాలీ




**బెల్లంపల్లి,మే26(సూర్యరేఖ)** ఆపరేషన్ సిందూర్ ఘన విజయంపై బిజెపి ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు.అనంతరం బీజేపీ పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ..ఆపరేషన్ సిందూర్లో భారత బలగాలు పాకిస్థాన్ ఉగ్రవాద శిబిరాలను,సైనిక స్థావరాలను దెబ్బతీసి సత్తా చాటాయని పేర్కొన్నారు.దేశ రక్షణ కోసం ప్రజలందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు.జై జవాన్,భారత్ మాతాకీ జై నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు కోడి రమేష్,బెల్లంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్ కుమార్,బెల్లంపల్లి పట్టణ అధ్యక్షురాలు దార కళ్యాణి,మాజీ కౌన్సిలర్ రాజులాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బార్ యజమాని నిర్లక్ష్యం నిండు ప్రాణం బలి

**-బార్ లో గొడవ ఆపేందుకు యత్నించిన పవన్ కుమార్ మృతి**

**ఉప్పల్,మే26(సూర్య రేఖ):** బార్ యజమాని నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణం బలిగొంది.స్నేహితుల మధ్య గొడవ ఆపేందుకు యత్నించిన ఓ యువకుడు ప్రాణం కోల్పోయారు.ఈ సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామంతపూర్ లోని గుడ్ డే బార్ లో ఆదివారం రాత్రి జరిగింది.పోలీసుల కథనం ప్రకారం అంబర్ పేట్ బాపునగర్ చెందిన కుమ్మరి భాస్కర్ కుమారుడు పవన్ కుమార్(26) అతని మిత్రుడైన రిషికేష్ అలియాస్ నానితో కలిసి ఆదివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో గుడ్ డే బార్ కు మద్యం సేవించడానికి వచ్చారు.అదే సమయంలో అంబర్ పేట్ పటేల్ నగర్ కు చెందిన లింగనోళ్ల శ్రవణ్ కుమార్ గౌడ్(26) పక్క టేబుల్ లో ఉన్న హరికృష్ణ అనే వ్యక్తితో గొడవకు దిగి బీర్ బాటిల్ తో కొట్టేందుకు యత్నించగా పవన్ కుమార్ అడ్డుకోబోయాడు.దీంతో ఆగ్రహానికి గురైన శ్రవణ్ కుమార్ గౌడ్ కోపంతో పవన్ కుమార్ కణతపై బీర్ బాటిల్ తో గట్టిగా కొట్టడంతో అక్కడికక్కడే పడి మృతి చెందాడు.హరికృష్ణకు తీవ్ర గాయాలు అయ్యాయి.ఇంత పెద్ద ఎత్తున బార్ లో గొడవ





జరుగుతున్న యాజమాన్యం పట్టించుకోవడం పోవడం వల్లే పవన్ కుమార్ మరణించాడని తండ్రి భాస్కర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.బార్ యజమాని,శ్రవణ్ కుమార్ గౌడ్ లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పవన్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.ఈ మేరకు ఉప్పల్ సీఐ ఎన్ ఎలక్షన్ రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బుద్వేల్ గ్రీన్ సిటీలో పార్క్ స్థలం కబ్జా..






**నకిలీ ఎల్ఆర్ఎస్ తో స్టీల్ ప్లస్ ఫైవ్ అనుమతులు..**
**అనుమతులు రద్దుచేసి కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి..**
**బీజేవైఎం అసెంబ్లీ కో-కన్వీనర్ మాగాని శివ**

**రాజేంద్రనగర్,మే 26(సూర్యరేఖ)** గ్రేటర్? హైదరాబాద్?మున్సిపల్?కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ?పరిధిలో ప్రజా అవసరాల కోసం వదిలేసిన పార్కుల స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. భూముల ధరలకు రెక్కలు రావడంతో గతంలో వెంచర్లలో ప్రజా అవసరాల కోసం వదిలేసిన పార్క్ స్థలలలో బహుళ నిర్మాణాలు చేపడుతున్నారు.రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ గ్రామ రెవెన్యూ పరిధిలోని గ్రీన్ సిటీలో జయ కృష్ణ రియాల్టర్స్ పేరుతో 28 ఏండ్ల కింద చేసిన లేఅవుట్లో వదిలిన ఓపెన్?ఏరియా పార్కు స్థలం గజాల 534.75 తమదేనంటూ ఇద్దరు వ్యక్తులు నకిలీ ఎల్ఆర్ ఎస్ ను సృష్టించి స్టిల్ ప్లస్ 5 అనుమతులు జోనల్ స్థాయిలో పొందారు.పార్క్ స్థలం కబ్జా విషయం రాజేంద్రనగర్ అసెంబ్లీ బీజేవైఎం కో-కన్వీనర్ మాఘాని శివ దృష్టికి రావడంతో సోమవారం దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్నను కలిసి పార్క్ స్థలం కబ్జా విషయాన్ని వివరించారు.అనంతరం పార్క్ స్థలంలో తీసుకున్న అనుమతులను రద్దు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. నకిలీ ఎల్ఆర్ఎస్ ను సృష్టించి అధికారులు తప్పుదోవ పట్టించిన కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను కలిసి పార్క్ స్థలం కబ్జా విషయాన్ని వివరించారు.పార్క్ స్థలాన్ని కబ్జా చరమంచి కాపాడి ప్రజా ప్రయోజనార్ధం ఉపయోగించాలని విన్నవించారు.

**-పార్కు స్థలాలను రక్షించాలి...**
**అధికారులపై స్థానికుల ఆగ్రహం..**

రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణలోపంతో ఏకంగా పార్కు స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారు.కోట్ల రూపాయల విలువైన స్థలం కబ్జా చేస్తే సంబంధిత అధికారులు కిమ్మనకుండా ఉంటున్నారు.టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కనుసన్నల్లోనే కబ్జాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కబ్జా విషయమై అధికారుల దృష్టికి తీసుకుపోగా పొంతన లేని సమాధానం చెప్పి దాటవేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరు కబ్జాలను ప్రోత్సహించే విధంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణదారులతో అధికారులు, ప్రజా ప్రతినిధులు కుమ్మక్కవడటంతోనే పార్కు స్థలాల్లో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కు స్థలాలను సంరక్షించాలని అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

## గోసంరక్షణ చట్టం కఠినంగా అమలు చేయాలని వినతి పత్రం..




**రామాయంపేట,మే26 (సూర్యరేఖ)** రామాయంపేట మండల కేంద్రంలో సోమవారం గోసంరక్షణ చట్టం కఠినంగా అమలు చేయాలని రామాయంపేట బీజేవైఎం నాయకుల ఆధ్వర్యంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్ రాజాగౌడ్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సకల దేవతా స్వరూపం గోమాత వేదకాలం నుండి గోవును ఆరాధ్య దేవతగా పూజిస్తున్నామన్నారు.దేశ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టితో మొదలుకుని పర్యావరణ పరిరక్షణ,వ్యవసాయంతో పాటు మానవాళి ఆరోగ్య రక్షణకు గోమాత ఆధారం అలాంటి గోవులను ప్రస్తుతం విచ్చలవిడిగా వధించి మాంసాహారంగా ఉపయోగించుకుంటున్నారు.ముఖ్యంగా బక్రీద్ సందర్భంగా ఈ గోవధ మరీ రెట్టింపు స్థాయిలో జరుగుతోంది.చట్టాన్ని అమలు చేయవలసిన ప్రభుత్వ యంత్రాంగం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుదన్నారు.ఇప్పటికై నా గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. గోవులను పశువులను వధించకూడదని చట్టం చెబుతున్నా లేగ దూడలను వధించడం జరుగుతుందని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శీలం అవినాష్ రెడ్డి,మండల అధ్యక్షులు గొల్లపల్లి నవీన్ గౌడ్, బీజేవైఎం ఉపాధ్యక్షులు ప్రశాంత్ గౌడ్,పట్టణ ఉపాధ్యక్షులు జొన్నల భరత్,బాసం అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కు సహాయకుడిగా నాయబ్ తహశీల్దార్ నియామకం




**మందమర్రి,మే26(సూర్య రేఖ)** మందమర్రి మండల తహసీల్దార్ సహాయకుడిగా నాయబ్ తహశీల్దార్ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.మందమర్రి మండల తహసిల్దార్ పనకంటి సతీష్ కుమార్ సహాయకుడిగా పెద్దపల్లిలో విధులు నిర్వహించిన బి సంతోష్ ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు.వీరు మండలంలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి భూమి రికార్డులు,పంట గుణంకాలు,రైతుల రుణాల పంపిణీ ప్రజా ఫిర్యాదులు ఆదాయ బకాయిల సేకరణ,పంటల పరిస్థితులు,ప్రకృతి వైపరిత్యాలు పుస్తకాల్లో ఎంట్రీలు,కోర్టు వివాదాలు లాంటి ఇతర పరిపాలన పనులను నిర్వహించేందుకు తహశీల్దార్ కార్యాలయంలో కీలక అధికారి గా నాయబ్ తహశీల్దార్ గా విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

## తహశీల్దార్ కు సహాయకుడిగా నాయబ్ తహశీల్దార్ నియామకం



**మందమర్రి,మే26(సూర్య రేఖ)** మందమర్రి మండల తహసీల్దార్ సహాయకుడిగా నాయబ్ తహశీల్దార్ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.మందమర్రి మండల తహసిల్దార్ పనకంటి సతీష్ కుమార్ సహాయకుడిగా పెద్దపల్లిలో విధులు నిర్వహించిన బి సంతోష్ ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు.వీరు మండలంలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి భూమి రికార్డులు,పంట గుణంకాలు,రైతుల రుణాల పంపిణీ,ప్రజా ఫిర్యాదులు ఆదాయ బకాయిల సేకరణ,పంటల పరిస్థితులు,ప్రకృతి వైపరిత్యాలు పుస్తకాల్లో ఎంట్రీలు,కోర్టు వివాదాలు లాంటి ఇతర పరిపాలన పనులను నిర్వహించేందుకు తహశీల్దార్ కార్యాలయంలో కీలక అధికారిగా నాయబ్ తహశీల్దార్ గా విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

## లారీ అదుపుతప్పి బైకును ఢీకొట్టడంతో ఒకరు మృతి..



**రామాయంపేట,మే26 (సూర్యరేఖ)** రామాయంపేట మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా డిచ్ పల్లికి చెందిన పెద్దోళ్ల నిఖిల్,నితీష్ అనే స్నేహితులు ఇద్దరు కలిసి హైదరాబాద్ లో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నారు. డిచ్ పల్లి నుండి ఉదయం హైదరాబాద్ కు ఉద్యోగ రీత్యా బయలుదేరి వెళ్తుండగా రామాయంపేట ఆద్య హోటల్ వద్ద ఉదయం గుర్తుతెలియని డ్రైవర్ లారీని అతివేగంగా నడపడంతో అదుపుతప్పి వారు ప్రయాణిస్తున్న టీఎస్07సిసి4571 నెంబర్ గల బైక్ ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో నిఖిల్ (24) అక్కడికక్కడే మృతి చెందాడు.తోటి స్నేహితుడు నితీష్ తీవ్రంగా గాయపడ్డాడు.అతన్ని వెంటనే చికిత్స నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడనుండి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని యశోద ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రామాయంపేట ఏఎస్ఐ మల్లికార్జున్ తెలిపారు.

## అమాయకులే టార్గెట్గా ప్రైవేట్ ఫైనాన్స్‌ల వేధింపులు

## ప్రజా వాణిలో భాదితుల ఫిర్యాదు

**జగిత్యాల :** జగిత్యాల జిల్లా లో ప్రైవేట్ ఫైనాన్స్ ఆగడాలు రోజురోజుకు మితిమీరి, లోన్లు తీసుకొన్నవాళ్ళను విడిచి అమాయకులను వేదిస్తున్న సంఘటన జగిత్యాల లో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే జగిత్యాల రూరల్ మండలం తాటి పెల్లి గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులకు బజాజ్ ఫైనాన్స్, క్రెడ్బి కంపెనీలు లోన్ కట్టాలని వేధింపులకు దిగినట్లు ఫిర్యాదు లో పేర్కొన్నారు. లోన్లతో తమకు ఎలాంటి సంబంధం లేదని, లేని వ్యక్తులకు ఫోన్ చేసి వేధిస్తున్నారని సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ముక్కు ముఖం

## కరోనా పేరిట ప్రజలను భయాందోళనకు గురిచేయకండి

### ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్

**కోరుట్ల :** ప్రపంచ వ్యాప్తంగా కరోనా పేరిట జరిగిన విద్వాంసం మర్వక ముందే మళ్లీ మనల్ని భయాందోళనకు గురిచేసే గందరగోళం పునరావృతం అవుతుందని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ ఆరోపించారు.

సోమవారం కోరుట్ల పట్టణంలోని ఆయన కార్యాలయంలో పేట భాస్కర్ మాట్లాడుతూ కేవలం భయాందోళన వల్లే చాలా మంది గతంలో మృతి చెందారని ఇకపై అలాంటి సమస్యలు రాకూడదని దానికి దేశ పౌరులుగా మనందరి బాధ్యతగా సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న పుకార్లు నిజమైన వాటిని పదేపదే పెట్టడం వల్ల తీవ్ర ప్రాణనష్టం జరుగుతుందని అది గతంలో మనందరం సవి చూశామని గుర్తు చేశారు. మున్సిపల్ కార్మికులు, వైద్యులు వారి సిబ్బంది, పోలీసులు, రెవెన్యూశాఖ మరియు పాత్రికేయులు ప్రజలను అప్రమత్తం చేయడంలో వారిని రక్షించడంలో కీలక పాత్ర పోషించారని భవిష్యత్తులో కూడా వారి సేవలు వుంటాయని అలాంటి అప్పుడు సోషల్ మీడియాలలో వ్యాపార దృక్పథంతో ప్రజలను భయాందోళనకు గురిచేసి లబ్ది పొందాలని చూడడం కొందరు మానుకోవాలని పేట భాస్కర్ సూచించారు.

## ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి

**జగిత్యాల :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి పిర్యాదులు, వినతులను జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్. మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 59 పిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి ఎస్ లత, కోరుట్ల ఆర్డీఓ జివాకర్ రెడ్డి వివిధ జిల్లా అధికారులు,తహసీల్దర్లు,కలెక్టరేట్ పర్యవేక్షకులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు... వేగవంతంగా స్పీడ్ ఆఫ్ చేయాలి..

**జగిత్యాల :** జిల్లాలో వారి ధాన్యం కేంద్రాలలో ఉన్నటువంటి ధాన్యము ఆరబోసి మ్యాచర్ వచ్చిన వెంటనే వేగవంతంగా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు ఆదేశించారు . సోమవారం రోజున జిల్లాలోని జగిత్యాల రూరల్ మండలం,సోమన్ పల్లి గ్రామంలోని, ధర్మపురి మండలం లోని జైన గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగిత్యాల జిల్లాలోని వరి ధాన్యం కేంద్రాల్లో తడిసినటువంటి ధాన్యము ఆరబోసి మ్యాచర్ వచ్చిన వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు వెంటనే తరలించాలని కొనుగోలు చేసిన వెంటనే రైస్ మిల్లర్లకు పంపించాలని అధికారులకు ఆదేశించారు ప్రతిరోజు మిల్లులకు పంపాలి. రవాణా నిమిత్తం లారీల కొరత ఎక్కడా లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.. రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని అన్నారు. కొనుగోలు సెంటర్లలో ధాన్యం రవాణా అంశంలో వాహనాల కొరత, హామాలీల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం కొనుగోలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు ఆందోళన చెందవద్దని ఆన్నారు. సెంటర్ ఇంచార్జ్ అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్,డిఎం జితేంద్ర ప్రసాద్ ,జగిత్యాల రూరల్ తహసిల్దార్ శ్రీనివాస్ ధర్మపురి ఇంచార్జీ తహసిల్దార్ సుమన, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు..కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డ

### మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు,మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్



**రాజేంద్రనగర్,మే 26 (సూర్యరేఖ)** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్‌కు ఫార్ములా–ఈ కేసు లో ఈ నెల 28న విచార ణకు రావాలని ఏసీబీ ఏసీబీ నోటీసులు జారీ చేశారు. దీంతో మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎస్.వెంక టేష్ ప్రభుత్వంపై మండిపడ్డారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకో డానికి,ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించ డానికి కుట్రపూరితంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసిందని విమర్శించారు. ఫార్ములా–ఈ కేసులో ఈ నెల 28న విచారణకు రావాలని ఏసీబీ నోటీసులు జారీ చేయడానికి ఆయన తప్పుపట్టాడు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటిల రాజకీయ క్రీడలో భాగంగానే ఏసీబీ నోటీసులు జారీ చేసినట్లు స్పష్టమవుతోందన్నారు. పార్టీ నాయకులకు వరుస నోటీసులు జారీ చేయడం వెనుక రాజకీయ దురుద్దేశం ఉన్నట్లు తేటతెల్లమైందని..ఎవరెన్ని ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నించినా తట్టుకొని నిలబడ్డ చరిత్ర కేసీఆర్ సైనికులదని స్పష్టం చేశారు. ప్రతీకార రాజకీయాలు రేవంత్‌రెడ్డి అభద్రతా భావానికి స్పష్టమైన సంకేతాలని.. కల్పిత కేసులు న్యాయస్థానాల్లో నిలువవు..ప్రజామోదాన్ని పొందవని ఎస్.వెంకటేష్ పేర్కొన్నారు.

## ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ధర్నా



**రాజన్న సిరిసిల్ల జిల్లా,మే26(సూర్యరేఖ):** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని,ప్రజలకు క్షమాపణ చెప్పి వెంటనే గద్దె దిగాలని బీజేపీ పార్టీ ముస్తాబాద్ మండల అధ్యక్షులు సౌల్ల క్రాంతి ఆధ్వర్యములో ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని,బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెంగని మహేందర్ జనార్ధన్ చిటీనేనీ శ్రీనివాస్ రావు,బాధ నరేష్,వరి వెంకటేష్,ఎదునూరి గోపి,కోల కృష్ణ,చీకోటి మహేష్,పొన్నాల సత్యం రెడ్డి,బత్తుల గణేష్ శివ దేవరాజు మీసా శంకర్,యురడి రాజు,మోహన్,బాల్ రెడ్డి,ధీటి సత్తయ్య,రమేష్,మీసా శ్రీను మద్దికుంట రమేష్,అజయ్,పెంటాము నరేష్,పరకాల వేణు రఘు ప్రశాంత్,పద్మ,మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


## సిరిసిల్లలో హైటెన్షన్..కేటీఆర్ క్యాంపు కార్యాలయం ముట్టడి

### కాంగ్రెస్,బీఆర్ఎస్ నాయకులకు మధ్య వాగ్వాదం..



**రాజన్నసిరిసిల్ల జిల్లా,మే 27(సూర్యరేఖ)** రాజన్న సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కార్యాలయంలో వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రోటోకాల్ పాటించాలంటూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కాంగ్రెస్ నేతలు ముట్టడించారు. ఎమ్మెల్యే కేటీఆర్ కార్యాలయంలో ప్రోటోకాల్ ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టలేదంటూ కాంగ్రెస్ నాయకులు నిరసనకు దిగారు. సీఎం రేవంత్ రెడ్డి,తెలంగాణా తల్లి ఫోటోలతో కాంగ్రెస్ నాయకులు రాగా..పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు,కాంగ్రెస్ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి ఫోటో పగిలిపోవడంతో కాంగ్రెస్ నాయకులు కోపోద్రిక్తులయ్యారు. తెలంగాణా తల్లి,సీఎం రేవంత్ రెడ్డి ఫోటోలు తీసుకొని క్యాంపు కార్యాలయాన్ని ముట్టడికి కాంగ్రెస్ నాయకులు యత్నించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్,కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. తోపులాటలో టౌన్ సిఐ కృష్ణ వేలికి గాయమైంది. పోలీసుల లాఠీ ఛార్జ్ లో బీఆర్ఎస్ పట్టణా అధ్యక్షుడు జిందం చక్రపాణి సహా పలు మండలాల నాయకులకు,టౌన్ సీఐ కృష్ణకు వేలికి గాయాలయ్యాయి.

## తూప్రాన్ డీఎస్పీని మర్యాదపూర్వక కలిసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ నాయకుడు




**శివంపేట,మే26(సూర్య రేఖ)** శివంపేట గ్రామానికి చెందిన మైనారిటీ జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ అలీ తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ జిల్లా నాయకులు అరుణ్ గౌడ్,సాయి ప్రణయ్,నరేందర్,విక్కీ,ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ..



**రాజన్నసిరిసిల్ల జిల్లా,మే 26(సూర్యరేఖ)** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లలో సోమవారం తిప్పాపురంలోని 8వ వార్డులో కొలతలు తీసి ముగ్గు పోయడం జరిగింది. ఈ కార్యక్రమములో పి.డి.శేఖర్ రెడ్డి,ఖాజామొయినుద్దీన్, సౌజన్య,కార్యదర్శి రాకేష్,ఇందిరమ్మ కమిటీ సభ్యుడు నాగుల విష్ణు ప్రసాద్ నరాల మంజుల,నరాల రేణుక,తదితరులు పాల్గొన్నారు.

## గోవులను అక్రమంగా రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం..



**రామాయంపేట,మే26 (సూర్యరేఖ)** రామాయంపేట మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం బీజేవైఎం నాయకులు గోసంరక్షణ చట్టంలో భాగంగా గోవులను కాపాడాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట రాజాగౌడ్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐ వెంకట రాజాగౌడ్ మాట్లాడుతూ...గోవులను అక్రమంగా రవాణా చేస్తే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా గోవులను లేగ దూడలను పశువులను అక్రమంగా రవాణా చేసినా వధించిన వారిపై చర్యలు తప్పవని పేర్కొన్నారు. రామాయంపేట డివిజన్ పరిధిలో ఎవరైనా గోవులను అక్రమంగా రవాణా చేసిన వధించిన పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని గోసంరక్షణ చట్టం ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పేకాట స్థావరంపై బెల్లంపల్లి 2 టౌన్ పోలీసుల దాడి

### నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



**బెల్లంపల్లి,మే26(సూర్య రేఖ)** బెల్లంపల్లి 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబేద్కర్ రడాగాంబాల బస్తీ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో బెల్లంపల్లి 2 టౌన్ పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న మొత్తం ఐదుగురు వ్యక్తులలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా ఒక వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. పట్టుకున్న నలుగురు వ్యక్తుల నుండి రూ.3050,2 మొబైల్ ఫోన్స్ సీజ్ చేసినట్లు బెల్లంపల్లి 2 టౌన్ ఎస్సై మహేందర్ తెలిపారు. ఈ ఆపరేషన్ లో బెల్లంపల్లి 2 టౌన్ హెడ్ కాన్స్టేబుల్ రవీందర్,కానిస్టేబుల్ శేఖర్,హెూం గార్డ్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## బాబా ఆలయాలకు 14 కిలోల రెండు కంచు గంటలు అందజేత..





**శివంపేట,మే 26(సూర్యరేఖ)** శివంపేట మండలం గూడూరు గ్రామంలోని హాయ్ బాబా మందిరం,పాంబండ శ్రీదత్తాత్రేయ మహాస్వామి దేవాలయం,శ్రీషిరిడి మందిరానికి అక్కమల్ల లక్ష్మీ మైసయ్య యాదవ్14 కిలోల రెండు కంచు గంటలు 22 వేలు విలువైనవి అందచేశారు. ఆ గురుదేవుల కృప ఆశీస్సులు వర్షించి వారి కుటుంబ అందరు ఆయురారోగ్యాలు,సర్వ సౌభాగ్యాలతో సుఖ సంతోషాలు,పొందాలని శ్రీగురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ గౌరవ సభ్యులు అభివర్ణించారు.

## బిజినెస్

# 4వ ఆర్థిక శక్తిగా భారత్

### నిన్న యాపిల్.. నేడు శామ్‌సంగ్




భారత్‌లో తయారైన ఐఫోన్లను అమెరికాలో ఎక్కడ విక్రయించినా ఇరవై ఐదు శాతం సుంకం విధిస్తానని యాపిల్ కంపెనీని హెచ్చరించిన కొన్ని గంటలకే దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శామ్‌సంగ్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. శామ్‌సంగ్ సహా అమెరికా వెలుపల తయారయ్యే ఏ కంపెనీ ఫోన్ అయినా వాటికి టారిఫ్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఓవల్ కార్యాలయం వెలుపల ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ 'మరిన్ని కంపెనీలూ సుంకాలు చెల్లించాల్సిందే. అది శామ్‌సంగ్ కావచ్చు. ఐఫోన్‌ను ఉత్పత్తి చేసే మరో కంపెనీ కావచ్చు. ఆ కంపెనీలు తమ ఫోన్లను ఇక్కడ తయారు చేస్తే సుంకం ఉండదు' అని చెప్పారు. యాపిల్ సీఈఓ టిమ్ కుక్‌కు సుంకాల విషయాన్ని గతంలోనే చెప్పానని ట్రంప్ అంతకుముందు అన్నారు. 'అమెరికాలో విక్రయించే మీ ఐఫోన్లు ఇక్కడే తయారు కావాలని, అంతే కానీ భారత్‌లోనో మరో చోటో తయారైతే సుంకాలు విధించక తప్పదని చాలాకాలం క్రితమే ఆయనకు తెలిపాను. ఒకవేళ వేరే దేశంలో ఐఫోన్‌ను తయారు చేస్తే యాపిల్ కంపెనీ కనీసం 25 శాతం సుంకం చెల్లించాల్సి ఉంటుంది' అని అన్నారు. యాపిల్ కంపెనీ భారత్‌కు వెళ్లి అక్కడ ప్లాంట్లు నిర్మిస్తే తనకేమీ అభ్యంతరం లేదని, అయితే అది టారిఫ్ లేకుండా అమెరికాలో తన ఉత్పత్తులను అమ్మలేదని ఓవల్ కార్యాలయం వద్ద ట్రంప్ స్పష్టం చేశారు. 'ప్లాంట్లు నిర్మించడానికి భారత్ వెళతానని టిమ్ చెప్పారు. ఆయన భారత్ వెళితే ఓకే. కానీ మీరు టారిఫ్ లేకుండా ఇక్కడ ఐఫోన్లను అమ్మలేరు' అని ట్రంప్ అన్నారు.

### ఆపిల్ ట్రంప్ బెదిరింపులకు తలొగ్గుతుందా?



భారతదేశంలో లేదా అమెరికా కాకుండా మరే ఇతర దేశంలో ఐఫోన్‌లను తయారు చేస్తే కనీసం 25 శాతం సుంకాలు చెల్లించాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ఐఫోన్ తయారీదారు ఆపిల్ సీఈఓ టిమ్ కుక్‌ను హెచ్చరించిన విషయం తెలిసిందే. ఇంతలో చైనా-అమెరికా మధ్య సుంకాల యుద్ధం ప్రారంభమైన తర్వాత కంపెనీ తన ఉత్పత్తి కేంద్రాన్ని చైనా నుండి భారతదేశానికి మార్చడానికి పూర్తి సన్నాహాలు చేసింది. ఇప్పుడు మరో ప్రశ్న తలెత్తుతుంది. ట్రంప్ బెదిరింపులకు కుక్ తలొగ్గుతాడా? అని. కొన్ని వర్గాలను ఉటంకిస్తూ, ఆపిల్ వంటి ప్రధాన సాంకేతిక సంస్థ భారతదేశంలో తన తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలనే నిర్ణయంలో ఎటువంటి మార్పు ఉండదని కేంద్ర ప్రభుత్వం ఆశావాదంతో ఉందని జచీచీ-చీవఌ18 నివేదించింది. ఇందులో కంపెనీ రాజకీయ ఒత్తిడి కంటే దాని లాభాలకే ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తుంది. భారతదేశంలో ఐఫోన్‌లను తయారు చేయడం వల్ల తక్కువ ఖర్చులు, ప్రభుత్వం నుండి ప్రోత్సాహకాలు, మెరుగైన సరఫరా మొదలైన అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ ప్రయోజనాలకు కంపెనీ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. ట్రంప్ ఒత్తిడి ఉన్నప్పటికీ ఆపిల్ లాభాల మార్జిన్లను పరిశీలిస్తుందని తాను విశ్వసిస్తున్నానని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు మీడియాకు తెలిపారు. ప్రస్తుతం, ఆపిల్ యునైటెడ్ స్టేట్స్‌లో స్మార్ట్‌ఫోన్‌లను తయారు చేయడం లేదు. చాలా ఐఫోన్‌లు చైనాలో తయారవుతున్నాయి. అయితే భారతదేశం ఇప్పుడు ఆపిల్ మొత్తం ఉత్పత్తిలో దాదాపు 15 శాతం వాటాను కలిగి ఉంది. ఇది సంవత్సరానికి దాదాపు 40 మిలియన్ యూనిట్లు. మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఆపిల్ తన ఐఫోన్‌లలో 60 శాతానికి పైగా భారతదేశంలో తయారు చేసింది. దీని ఉత్పత్తి విలువ ఏ22 బిలియన్లు అని అంచనా.



భారతదేశం ఇప్పుడు 4వ అతి పెద్ద ఆర్థి క శక్తివంత దేశంగా అవతరించిందని నీతి ఆయో గ్ కార్యనిర్వాహణాధికారి (సిఇఒ) బివిఆర్ సుబ్రమణ్యం తెలిపారు. ఈ కీలక మైలురాయి సాధన దిశలో మనం జపాన్‌ను వెనకకు నెట్టివేశామని వివరించారు. ఇది మనకు మనం చెప్పుకునే ప్రగ తి కాదని, ఐఎంఎఫ్ ఇతర అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు వెలువరించిన తాజా గణాంకాల, నివేదికల క్రమంలో వెలుగులోకి వచ్చిన సత్యం అని వివరించారు. తాను ఈ ప్రగతి పథం గురించి వివరిస్తున్న దశలో మన ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్ల స్థాయిలో బలోపేతంగా ఉందని తెలిపారు. ఇది మన నాలుగవ స్థానాన్ని నిర్ధారించింది. ఇం తటితో ఆగిపోకుండా మనకు అన్ని రకాలుగా భౌ గోళిక రాజకీయ, ఆర్థిక అనుకూల పరిస్థితులు పలు విధాలుగా ఊతం ఇస్తున్నాయని సిఇఒ చెప్పారు. అమెరికా, చైనా, జర్మనీ తరువాతి స్థానం మనదే అని, ఈ ప్రగతి పథం వేగం మరింత ఇనుమడిస్తే ఇక మనం వచ్చే రెండేళ్లలోనే మూడవ ఆర్థిక శక్తివంత దేశంగా నిలుస్తామని తెలిపారు. గత ఏడాది చివరి వరకూ ఇండియా జపాన్ కన్నా వెనుక ఉండి, ఐదవ ఆర్థిక శక్తిగా జాబితాలో ఉం ది. అయితే జపాన్‌ను మనం తోసిరాజన్నామని తెలిపారు. ఎప్రిల్‌లో ఐఎంఎఫ్, వరల్డ్ ఎకనామిక్ ఔట్‌లుక్ సంస్థల నివేదిక వెలువడింది. ఇందులో ఇండియా నాలుగవ ఆర్థిక శక్తి కానుందని తెలిపారని గుర్తు చేశారు. దేశ జిడిపి ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో 4.187 బిలియన్ డాలర్లు దాటుతుంది. ఇది జపాన్ ఆర్థిక శక్తిని దాటేయడం కిం దికి తీసుకోవచ్చు. ఇక తలసరి ఆదాయం క్రమంలో భారతదేశ వివరాలు ఐఎంఎఫ్ డేటా ప్రకారం చూస్తే ఏడాదిలో రెండింతలు అయింది. పలు అంతర్జాతీయ ఆర్థిక సంస్థల విశ్వసనీయ ప్రతిష్టాత్మక నివేదికలలో కూడా భారత్ అజేయ ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న వైనం స్పష్టం అవుతోందని సిఇఒ తెలిపారు. ఐఎంఎఫ్ తమ ప్రపంచ ఆర్థిక .పరిస్థితి నివేదికలో భారతదేశ ఆర్థిక రంగం 2025 26 ఆర్థిక సంవత్సరంలో 6.2 శాతం ఎదుగుదల ఉంటుందని విశ్లేషించింది. నిర్ణీత ఆరున్నర శాతంతో పోలిస్తే కొద్దిగా మందగమనం ఉంటున్నప్పటికీ పరిస్థితి ద్విగుణీకృత రీతిలో ఉందని తెలిపారని సిఇఒ చెప్పారు. ఈ విషయాలన్నింటిని సిఇఒ ఇటీవలి నీతి ఆయోగ్ భేటీలో పమర్పించిన వికసిత్ రాజ్య వికసిత్ భారత్ ఏ2047 నివేదికలో తెలిపారు. ఇంతకు ముందటి వరకూ బలహీన స్థాయి ఐదవ ఆర్థిక శక్తిగా మన దేశందశాబ్ద కాలంలో బలీయ ఆర్థిక శక్తివంత దేశంగా ఎదిగింది. ఇది ఇప్పుడు నాలుగో అతి పెద్ద ఆర్థిక శక్తిగా మారడం తిరుగులేని విజయం అని నీతి ఆయోగ్ నిర్వాహక అధికారి వివరించారు. ఇక భారతదేశ ఆర్థిక వ్యవస్థ నిర్ణీత 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుని తీరుతుందని వివరించారు.

# ఇండియన్ స్టారప్‌తో జతకట్టిన యమహా..



యమహా కంపెనీ త్వరలో రివర్ ఇండి ఆధారంగా సరసమైన ఎలక్ట్రిక్ స్కూటర్ మార్కెట్‌లో విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని నిపుణులు చెబుతున్నారు. రాబోయే యమహా ఈవీకు ఆర్‌వై 01 అనే కోడ్ నేమ్ కూడా ఉంది. రివర్ ఇండి ఈవీ స్కూటర్ మాదిరిగానే బ్యాటరీ నిర్వహణ వ్యవస్థ, పవర్ ట్రెయిన్‌ను ఉపయోగిస్తుందని పలు నివేదికల ద్వారా స్పష్టమైంది. జపాన్‌కు చెందిన యమహా మోటార్ కంపెనీ ఫిబ్రవరి 2024లో రివర్ ఇండి కంపెనీ సుమారు 40 మిలియన్ల డాలర్ల పెట్టుబడి పెట్టింది. రివర్ ఇండీ భాగస్వామ్యంతో కొత్త యమహా ఆర్‌వై01 ఎలక్ట్రిక్ స్కూటర్ ఈ పండుగ సీజన్‌తో ఉత్పత్తి ప్రారంభించి ఈ సంవత్సరం చివరి నాటికి లాంచ్ అవుతుందని భావిస్తున్నారు.ఈ కొత్త ఈవీ భారతదేశం, అమెరికా, యూరప్లోని యమహా గ్లోబల్ ఇంజనీరింగ్ బృందాలు అభివృద్ధి చేస్తున్నాయి. యమహా డిజైన్ మరియు బ్రాండ్ ఎథోస్‌తో వచ్చే ఈ స్కూటర్ లాంచ్ అయినా ఇంజనీరింగ్, టెస్టింగ్, పరిశోధన, అభివృద్ధి, అన్నీ రివర్ కంపెనీ ద్వారా నిర్వహిస్తారు. డిజైన్ ఫైనల్ అయిన తర్వాత యమహా ఆర్‌వై ఈవీ స్కూటర్‌ను బెంగళూరులోని రివర్ కంపెనీ తయారు చేస్తుంది. ఇక్కడి నుంచే ఈ స్కూటర్ ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేస్తారు. దీని వల్ల దేశంలో ఉత్పత్తి పరిమాణం పెరుగడంతో ఖర్చులు నియంత్రణలో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. యమహా వంటి గ్లోబల్ కంపెనీ పవర్ ట్రెయిన్, ఇంజనీరింగ్, బ్యాటరీ ఇంటిగ్రేషన్, టెస్టింగ్తో కూడిన భారతీయ ఎలక్ట్రిక్ వాహన స్టార్టప్‌ను విశ్వసించడం శుభపరిణామమని నిపుణులు చెబుతున్నారు. భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల కోసం పెరుగుతున్న పరిశోధన, అభివృద్ధి, తయారీ సామర్థ్యాలకు నిదర్శనంగా ఈ భాగస్వామ్యంగా సాక్ష్యంగా నిలుస్తుందని నివేదికల్లో స్పష్టం చేస్తున్నారు. యమహా ఆర్‌వై 01 భారతదేశంలో ప్రారంభిస్తే టీవీఎస్ ఐక్యూబ్, ఏథర్ రిజ్టా, బజాజ్ చేతక్, హీరో విడీ వీ1 వంటి ఈవీ స్కూటర్లకు గట్టి పోటినిస్తుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# అతడు తెలివైన బౌలర్..
# మాకు అద్భుతమైన ఆల్‌రౌండర్ దొరికినట్టే..!



ఐపీఎల్ 18వ సీజన్‌లో స్థాయికి తగ్గట్టు ఆడలేకపోయిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో రికార్డు స్కోర్‌తో అలరించింది. హెన్రిచ్ క్లాసెన్ వీరోచిత సెంచరీతో చెలరేగగా.. నిరుడు ఫైనల్లో తమను ఓడించిన కోల్‌కతా నైట్ రైడర్స్‌పై ప్రతీకారం తీర్చుకుంది. ఈ మ్యాచ్‌లో సమిష్టిగా రాణించిన కమిన్స్ సేన డిఫెండింగ్ ఛాంపియన్‌కు ఘోర పరాభవాన్ని కట్టబెట్టింది. అయితే.. యువ స్పిన్నర్ హర్ష్ దూబే సంచలన బౌలింగ్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. హ్యాట్రిక్ మిస్ అయిన ఈ కుర్రాడిపై హెడ్ కోచ్ డానియల్ వెటోరీ ప్రశంసల వర్షం కురిపించాడు. 'ఫిరోజ్‌షా కోట్లా మైదానంలో హర్ష్ దూబే అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఆలస్యంగా జట్టులోకి వచ్చినప్పటికీ ఈ కుర్రాడు తన నైపుణ్యంతో ఆకట్టుకున్నాడు. అతడి ప్రదర్శన పట్ల టీమ్ మేనేజ్‌మెంట్ అంతా సంతోషంగా ఉంది. దూబే చాలా తెలివైన బౌలర్. పరిస్థితులను చక్కగా అర్థం చేసుకుంటాడు. అంతుకు తగ్గట్టుగా తన బౌలింగ్‌ను మార్చుకుంటాడు. కానీ, మారోజుల్లో మేము అతడిలా చేయలేకపోయాం. గత మూడు మ్యాచుల్లో దూబే తన బౌలింగ్‌తో అందరి మెప్పు పొందాడు. వచ్చే ఐపీఎల్ సీజన్ కల్లా అతడు మరింత రాటుదేలుతాడు. భారత ఏ జట్టు, దేశవాళీ క్రికెట్.. రూపంలో ఈ లెగ్ స్పిన్నర్‌కు అపారమైన అవకాశాలున్నాయి. సో.. హర్ష్ బౌలర్‌గానే కాకుండా బ్యాటర్‌గానూ మెరుగవుతాడని ఆశిస్తున్నా. అదే జరిగితే ఆరెంజ్ ఆర్మీకి అద్భుతమైన ఆల్‌రౌండర్ దొరికినట్టే' అని కోల్‌కతాపై విజయం అనంతరం వెటోరీ వాఖ్యానించాడు. కోల్‌కతాపైనే కాకుండా ఆర్సీబీతో మ్యాచ్‌లోనూ దూబే తెలివిగా విరాట్ కోహ్లీ ని బోల్తా కొట్టించాడు. అతడిని బ్యాక్‌వర్డ్ దిశగా ఆడేలా చేసి వికెట్ సాధించి.. హైదరాబాద్‌కు బిగ్ వికెట్ అందించాడు.

### క్రికెట్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. జియో హాట్‌స్టార్‌లో భారత్-ఇంగ్లండ్ మ్యాచ్‌లు?



భారత క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్. ఈ ఏడాది జూన్‌లో జరగనున్న ఇండియా- ఇంగ్లండ్ టెస్టు సిరీస్ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను జియోహాట్‌స్టార్ సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో అభిమానులు ఈ ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను జియోహాట్‌స్టార్ యాప్ అండ్ వెబ్ సైట్‌లో వీక్షించవచ్చు. కాగా వాస్తవానికి 2031 వరకు ఇంగ్లండ్‌లో జరిగే మ్యాచ్‌లను ప్రసారం చేసే అన్ని హక్కులను సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్ కలిగి ఉంది. అయితే క్రిక్‌బజ్ రిపోర్ట్ ప్రకారం.. ఈ మార్క్యూ సిరీస్ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను జియో హాట్‌స్టార్‌కు సోనీ సబ్-లైసెన్స్ చేసినట్లు సమాచారం.ఈ ఒప్పందం రెండు కంపెనీల మధ్య దాదాపు నెల రోజుల చర్చల తర్వాత జరిగినట్లు సదరు క్రికెట్ వెబ్‌సైట్ తమ రిపోర్ట్‌లో పేర్కొంది. కాగా జియోహాట్‌స్టార్ ఇప్పటికే భారత్ హోమ్ సిరీస్‌లు, ఐసీసీ టోర్నమెంట్‌లు, ఐపీఎల్, ఆస్ట్రేలియాలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ప్రసార హక్కులను కలిగి ఉంది. ఇప్పుడు కొత్తగా ఇంగ్లండ్-భారత్ మధ్య టెస్టు సిరీస్ డిజిటల్ హక్కులను కూడా దక్కించుకుంది. ఇక ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్ జూన్ 20 నుంచి ప్రారంభం కానుంది. వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27లో ఇదే తొలి సిరీస్. ఇంగ్లండ్ పర్యటన కోసం భారత జట్టు బీసీసీఐ ఇప్పటికే ప్రకటించింది. కొత్త కెప్టెన్ శుబ్‌మన్ గిల్ నేతృత్వంలో టీమిండియా ఇంగ్లండ్‌కు పయనం కానుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వంటి సీనియర్లు టెస్టులకు వీడ్కోలు పలకడంతో యువ ఆటగాళ్లతో కూడిన భారత జట్టు ఇంగ్లండ్‌తో తలపడనుంది.

## స్పోర్ట్స్

### 'క్వాలిఫయర్-1, ఫైనల్ ఆడే జట్లు ఇవే!




ఐపీఎల్-2025 ముగింపు దశకు వచ్చేసింది. గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్స్‌నకు అర్హత సాధించగా.. క్వాలిఫయర్-1 కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. లీగ్ దశ ముగిసే సరికి టాప్-2లో ఉన్న జట్లు ఈ పోరుకు అర్హత సాధిస్తాయన్న విషయం తెలిసిందే.

**ఆ రెండు మ్యాచ్‌ల ఫలితాలతో..**

సీజన్‌లో పద్నాలుగు మ్యాచ్‌లూ పూర్తి చేసుకున్న గుజరాత్.. తొమ్మిది గెలిచి 18 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. మిగిలిన మూడు జట్లకు లీగ్ దశలో ఒక్కో మ్యాచ్ మిగిలి ఉండగా.. ఓవరాల్‌గా సీజన్‌లో రెండు మిగిలి ఉన్నాయి. ఇందులో భాగంగా సోమవారం పంజాబ్ కింగ్స్- ముంబై ఇండియన్స్ తలపడనుండగా.. మంగళవారం నాటి పోరులో ఆర్సీబీ లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆడుతుంది. ఈ మ్యాచ్ తర్వాత టాప్-2లో నిలిచి క్వాలిఫయర్-1 ఆడే జట్లు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచి ఎలిమినేటర్ మ్యాచ్ ఆడే జట్లు ఏవో తేలుతాయి. ఇక క్వాలిఫయర్-1లో ఓడిపోయిన జట్టు.. ఎలిమినేటర్ విజేతతో క్వాలిఫయర్-2లో తలపడుతుందన్న విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు, క్వాలిఫయర్-1 విజేత టైటిల్ పోరుకు అర్హత సాధిస్తాయి.

**ఫైనల్ ఆడే జట్లు ఇవే**

ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్, కామెంటేటర్ ఆకాశ్ చోప్రా క్వాలిఫయర్-1, ఫైనల్లో తలపడే జట్లపై తన అంచనా తెలియజేశాడు. పంజాబ్ కింగ్స్‌పై ముంబై, లక్నోపై ఆర్సీబీ గెలిచి పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాలు ఆక్రమిస్తాయని జోస్యం చెప్పాడు. అదే విధంగా.. ఈ రెండు జట్లే ట్రోఫీ కోసం ఫైనల్లో తలపడతాయని అంచనా వేశాడు. ఈ మేరకు తన యూట్యూబ్ చానెల్‌లో మాట్లాడుతూ.. "ముంబై పంజాబ్‌పై గెలవాలని పట్టుదలగా ఉంది. వాళ్లు గనుక గెలిస్తే టాప్-2లోకి వస్తారు. ఇది జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇక ఆర్సీబీ కూడా అంతే. లక్నోపై ఆ జట్టు గెలిచే ఛాన్స్ ఎక్కువగా ఉంది. నా అంచనా ప్రకారం ముంబై- ఆర్సీబీ టాప్-2లో నిలుస్తాయి. అదే విధంగా ఈ రెండు జట్లే ఫైనల్లోనూ తలపడతాయి" అని మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు.






## కన్నప్పలో ప్రభాస్..
## రెబల్ స్టార్ పాత్ర నిడివిపై మంచు విష్ణు కామెంట్స్

టాలీవుడ్ హీరో మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కించిన చిత్రం కన్నప్ప. ఈ మూవీ ఇప్పటికే రిలీజ్ కావాల్సి ఉండగా.. ప్రీ ప్రొడక్షన్ కారణంగా వాయిదా పడింది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా వచ్చేనెల 27న థియేటర్లలో సందడి చేయనుంది. రిలీజ్‌కు ఇంకా నెల రోజుల సమయం మాత్రమే ఉండడంతో ఈ సినిమా ప్రమోషన్లతో బిజీగా ఉన్నారు మంచు విష్ణు. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన మంచు విష్ణు.. ప్రభాస్ రోల్ గురించి ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ 30 నిమిషాల పాటు అతిథి పాత్రలో కనిపిస్తారని మంచు విష్ణు తెలిపారు. కన్నప్ప 3 గంటల 10 నిమిషాల రన్‌టైమ్‌ను కలిగి ఉందని అన్నారు. కన్నప్ప పరివర్తనలో కీలక పాత్ర పోషించే దైవిక వ్యక్తిగా ప్రభాస్ నటించారని వెల్లడించారు. ఈ సినిమాను ఆధ్యాత్మిక మార్గంలో బయలుదేరే ఒక నాస్తికుడి గురించిన పౌరాణిక కథగా తెరకెక్కించినట్లు తెలిపారు. ప్రభాస్‌కు మోహన్ బాబుతో ముఖ్యమైన సన్నివేశాలు ఉన్నాయని వివరించారు. మోహన్ లాల్ పాత్ర 15 నిమిషాలకే పరిమితం అయినప్పటికీ.. బలమైన భావోద్వేగాన్ని కలిగి ఉంటుందని పేర్కొన్నారు. కాగా.. ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ అతిథి పాత్రలలో కనిపించనున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి శ్రీ-కాళహస్తి అనే పాటను విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సాంగ్ మే 28న విడుదల కానుంది. ఈ భక్తి గీతంలో విష్ణు కుమార్తెలు అరియానా, వివియానా పాడారు. ఈ పాటకు స్టీఫెన్ దేవస్సీ సంగీతం అందించారు. ఆధ్యాత్మికంగా ఈ పాట ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందని మేకర్స్ భావిస్తున్నారు. ఈ సినిమాకు ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించగా.. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై నిర్మించారు. ఈ సినిమాలో మోహన్ బాబు, శరత్‌కుమార్, అర్పిత్ రంకా, ప్రీతి ముఖుందన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## నవీన్ పొలిశెట్టి అనగనగా ఒక రాజు థియేటర్లలోకి వచ్చే టైం ఫిక్స్

మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా తర్వాత జాతి రత్నాలు ఫేం నవీన్ పొలిశెట్టి కాంపౌండ్ నుంచి వస్తోన్న సినిమాల్లో ఒకటి అనగనగా ఒక రాజు ఇప్పటికే లాంచ్ చేసిన ప్రీ వెడ్డింగ్ వీడియో వైరల్ అవుతోంది. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ సినిమా నవీన్ పొలిశెట్టికి ప్రమాదం కారణంగా ఆలస్యమైంది. తాజాగా మేకర్స్ చాలా రోజులకు రిలీజ్ అప్‌డేట్ అందిస్తూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా జనవరి 26న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ విడుదల చేసిన పోస్టర్‌లో నవీన్ పొలిశెట్టి లుంగీ, బనియన్ వేసుకుని, మెడలో రుమాలు వేసుకొని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకుపై వెళ్తుండటం చూడొచ్చు. ఈ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రాన్ని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ కో ప్రొడ్యూస్ చేస్తుంది. మిక్కీ జే మేయర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.

**ఇదేమైనా మలబార్ గోల్డ్ వాళ్ల పెళ్లా..?**

రాజుగారి పెళ్లి విందులో చమ్మక్ చంద్ర అరేయ్ ఇది రాజుగారి పెళ్లి.. గెస్టులందరికీ గోల్డ్ ప్లేట్స్ మాత్రమే పెట్టండి.. అంటూ చెప్పే డైలాగ్స్‌తో మొదలైంది ప్రీ వెడ్డింగ్ వీడియో. అతిథుల్లో ఓ వ్యక్తి ఏంటండి వీళ్లు ప్లేటు గోల్డ్.. స్వీటు గోల్డ్ అంటున్నారు.. ఇదేమైనా మలబార్ గోల్డ్ వాళ్ల పెళ్లా అని అడుగుతుంటే.. మరో వ్యక్తి ఏవండి ఇది మా రాజుగారి పెళ్లండి అని అంటున్నాడు. నవీన్ పొలిశెట్టి ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వెడ్డింగ్ క్యాసెట్ చూస్తూ.. ముఖేశ్ అంబానీకి ఫోన్ చేసి.. ముఖేశ్ మామయ్యా ఈవెంట్‌కు వచ్చిన సెలబ్రిటీల ఫోన్ నంబర్లు పెట్టు చెబుతా.. ఈ ఇయర్ అంతా అంబానీ పెళ్లి.. వచ్చే ఏడాదంతా రాజుగారి పెళ్లి అంటున్నాడు. జాతి రత్నాలు హీరో స్టైల్ ఆఫ్ హ్యూమర్ టచ్‌తో సాగుతున్న వీడియో సినిమాపై అంచనాలు అమాంతం చేస్తోంది.




## మ్యాడ్ స్క్వేర్ తర్వాత గ్యాంబ్లర్స్.. టీజర్ చూశారా?




మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాల ఫేమ్ సంగీత్ శోభన్ హీరోగా రూపొందిన చిత్రం 'గ్యాంబ్లర్స్'. తాజాగా ఈ సినిమా నుంచి టీజర్ విడుదలైంది. ఒక ఐలాండ్‌లో జరిగే జూదం చుట్టూ ఈ మూవీ కథ తిరుగుతుంది. కేఎస్‌కే చైతన్య దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ప్రశాంతి చారులింగ హీరోయిన్‌గా, రాకింగ్ రాకేశ్ ముఖ్యపాత్రలో నటించారు. సునీత, రాజ్‌కుమార్ బృందావనం నిర్మించారు. నిర్మాణానంతర పనులు తుది దశకు చేరుకున్న ఈ చిత్రాన్ని జూన్ 6న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. టీజర్ చూస్తే కథలో అనేక థ్రిల్లింగ్ అంశాలతో పాటు ట్విస్ట్‌లు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా ఉన్నాయి.

## అంచనాలు పెంచేసిన అడివి శేష్ డెకాయిట్




టాలీవుడ్ యంగ్ టాలెంటెడ్ హీరోస్‌లో అడివి శేష్ ఒకరు. ఇప్పటి వరకు ఆయన చేసిన చిత్రాలన్నీ కూడా వైవిధ్యంగా ఉంటాయి. అయితే ఈ హీరో నుండి సినిమా వచ్చి చాలా కాలమవుతుంది. ప్రస్తుతం మనోడు రెండు సినిమాలతో బిజీగా ఉన్నాడు. అందులో ఒకటి గూఢచారి సినిమాకు సీక్వెల్ గా జీ2 కాగా, మరొకటి డెకాయిట్. ఈ రెండు సినిమాలు ఇప్పుడు షూటింగ్ దశలోనే ఉన్నాయి. ఈ రెండు సినిమాల్లో ముందుగా జీ2 ముందు మొదలు కాగా, ఆ చిత్రమే ఫస్ట్ రిలీజవుతుందని అందరూ అనుకున్నారు. కాని జీ2 కన్నా ముందు డెకాయిట్ రిలీజ్ అవుతుంది. ఈ మూవీని డిసెంబర్ 25న విడుదల చేయనున్నట్టు గ్లింప్స్ ద్వారా తెలియజేశారు. మోస్ట్ అవెయిటెడ్ యాక్షన్ డ్రామాగా 'డెకాయిట్' రూపొందుతుండగా, దీనికి ఒక ప్రేమ కథ అనేది ట్యాగ్‌లైన్. షానిల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తుంది. అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు. తాజాగా మూవీ నుండి గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో అడివి శేష్ తన నటనతో మరోసారి ఆకట్టుకున్నాడు. గ్లింప్స్ అయితే మూవీపై భారీ అంచనాలు పెంచేసింది. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం కోసం సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. శేష్ నటించిన క్షణం , గూఢచారి సినిమాలకు సినిమాటోగ్రాఫర్ గా వర్క్ చేసిన షానియల్ డియో డైరెక్టర్ గా ఈ డెకాయిట్ చిత్రం తెరకెక్కుతుండడం విశేషం.. సుప్రియ యార్లగడ్డ , సునీల్ నారంగ్ సంయుక్తంగా ఈ చిత్నాన్ని నిర్మిస్తున్నారు. మూవీ మాత్రం పెద్ద హిట్ అవుతుందనే నమ్మకంతో మేకర్స్ ఉన్నారు. ఆ మధ్య శృతి హాసన్ ఇందులో నటిస్తుందని పోస్టర్ ద్వారా తెలిపారు. కాని తర్వాత ఆమె ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకుందని తెలిసింది. డేట్స్ ఇష్యూతో పాటు అడివి శేష్ కూడా కారణం అని తెలుస్తోంది. అడవి శేష్, శృతి హాసన్‌ను కలిసి స్క్రీన్‌పై చూడొచ్చని అంచనాలు పెంచుకున్న ప్రేక్షకులకు నిరాశే మిగిలింది.




Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,